# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి ప్రచురణ

**ఉగాది సంచిక**
**ఏప్రిల్ 2023**




మా (ఆధునిక) తెలుగు తల్లికి మల్లె పూదండా

**Telugu Jyothi**
April 2023


A Literary Magazine from
**Telugu Fine Arts Society**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

New Jersey, USA




ఈ లోకంలో అన్నింటికన్నా అమూల్యమైనది,
అతి మధురమైనది, అందమైనది అమ్మ అనురాగం.

సభ్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

## మాతృ దినోత్సవ శుభాకాంక్షలు

From

**TFAS Executive Committee**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
9 Yardley Ct, Franklin Park, NJ 08823: **http://www.tfas.net**

**Board of Trustees**
**2022-2024**

**President**
**Madhu Rachakulla**
*president@tfas.net*

**Vice President**
**Bindu Yalamanchili**
*vicepresident@tfas.net*

**Membership Services**
**Jyothi Kamarasu**
*membership@tfas.net*

**Secretary**
**Ravi Annadanam**
*secretary@tfas.net*

**Treasurer**
**Srinivas Cheruvu**
*treasurer@tfas.net*

**Cultural Events**
**Sudha Devulapalli**
*events@tfas.net*

**Community Services**
**Venkata Satya Tata**
*Community@tfas.net*

**IT Services**
**Naga Mahendar Velishala**
*it@tfas.net*

**Youth Services**
**Anil Kumar Veerisetty**
*youth@tfas.net*

**Advisors**
Dr. Hari Eppanapally
Radha Kasinadhuni
Dr. Satyaveni Rao
Dr. Raja Rao
Seshu Tatikatla

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor

## అధ్యక్షుని కలం నుండి



తెలుగు కళా సమితి సభ్యులకు , శ్రేయోభిలాషులందరి కి శ్రీ శోభకృతు నామ సంవత్సర (2023) ఉగాది మరియు శ్రీరామనవమి శుభాకాంక్షలు.

న్యూజెర్సీ తెలుగు కళా సమితి ఉగాది సంబరాలను శనివారం, ఏప్రిల్ 22,2023న సేరెవిల్లే వార్ మెమోరియల్ హై స్కూల్, సేరెవిల్లే లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నాము . కన్నుల విందుగా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 1200 మందికి పైగా సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సుమారు 250 మంది పిల్లలను ఈ సంబరాలలో భాగస్వాములుగా చేసాము. ఎప్పుడూ ఉండే కళా కార్యక్రమాలతో పాటుగా అంతర్జాతీయ రోబోటిక్స్ ప్రదర్శనను , సుమారు 25 మంది పిల్లలతో భగవద్గీత అంత్యాక్షరి కార్యక్రమం, పబ్లిక్ స్పీకింగ్ కార్యక్రమం మరియు సంప్రదాయేతర ఉపాధులను ఎంచుకున్న మహిళలతో మహిళా సదస్సు నిర్వహించాము. అంతర్జాతీయ రోబోటిక్స్ ప్రదర్శనలో మన తెలుగు వారే కాక ఇతర భాషల వాళ్ళు, ఇతర దేశస్థులు కూడా పాల్గొనడం ఎంతో ఆనంద దాయకం. ఇక మనం తెలుగు కళా సమితి 40వ వార్షికోత్సవం నిర్వహించటానికి సన్నద్ధులం అవుతున్నాము.

మీ అందరి సహాయ సహకారాలతో మరిన్ని చక్కటి కార్యక్రమాలు చేయాలనీ మా సంకల్పం. మీ సద్విమర్శలని, సలహాలని పంపించాలని నా మనవి .

**రాచకుళ్ళ మధు.**
అధ్యక్షులు, తెలుగు కళా సమితి
201-312-1305

# సంపాదకీయం

పూర్తిగా అంతర్జాల పత్రికలా ప్రచురిద్దామనుకున్న మా ప్రణాళిక software development లో వచ్చిన ఆలస్యాలవల్ల కుంటుబడింది. అందువలన ఈ సంచిక మామూలుగా pdf రూపేణా ప్రచురిస్తున్నాము. త్వరలో అంతర్జాల రూపంలో పునః ప్రచురణ చేస్తాము. వీటిలో పడిన రచనలన్నిటి మీదా పాఠకుల అభిప్రాయాలు editor@telugujyothi.com కి email రూపేణా పంపితే అవి ఆ పునఃప్రచురణలో వేస్తాము.

తెలుగుతనం మీద రచనలు కావాలని మేము చేసిన అభ్యర్ధనకి వచ్చిన స్పందనకి మా కృతజ్ఞతలు. వచ్చినవాటిలో కొన్ని మాత్రమే ఈ సంచికలో ప్రచురించడం కుదిరింది. మిగిలినవి 'తరువాయి సంచికలో.

నేను అఖిల భారత పౌరుణ్ణి, వీనీ వీనీ వినసాకళ్లూ నా భాషేమిటీ అని సవాల్ చేశారు అమరేంద్ర గారు.

తెలుగుతనమంటే మీఋ చెప్పినవన్నీనూ సుమా అన్నారు, సరోజ గారు

గుత్తి వంకాయ కూరోయి బావా అని కథాగానం చేశారు, కుంతి గారు

మా పెద్దవాళ్ళు మాకు నేర్పిన తెలుగుతనం మా పిల్లలకి నేర్పలేకపోతున్నానని బాధ పడ్డారు వైదేహి గారు

చిన్ననాటి తెలుగు జ్ఞాపకాలన్నీ కలబోసి వర్ణించి తెలుగుతనంటే మఱేమిటీ అని అడిగారు మలయవాసిని గారు.

మేం అడిగినట్లుగా ఆధునిక తెలుగు తల్లి చిత్రం రమణీయంగా వేసిన చిత్రకారులు, మోకా విజయకుమార్ గారికి ధన్య వాదాలు.

ఇక మిగతా రచనలు:

నవజీవన భాష్యాలు - ఆధునికాంధ్ర మహా భాగవతంలో ఉండదగిన వ్యాఖ్య.

రమణ గారి ప్రేమ పూలు చదువుతూంటే ఎందుకో 'సా విరహే తవ దీనా' గుర్తుకొచ్చింది.

గోపయ్య గారు remote working కుదరని తండ్రుల ఆవేదన బాగా వ్యక్తచేశారు

వేంకట సూర్య నారాయణ గారు, సాంకేతిక మరిణామంతో సమాజవిలువలు పడిపోతున్నాయన్న ఆవేదనాగానం చేశారు. కానీ ఈ ఆవేదన మానవ సమాజం పుట్టినప్పటినుండీ ఉన్నదేమో సుమా?

మారుతున్న సమాజంలో వస్తున్న మార్పులనీ బాధల్నీ వివరించారు శ్రీనివాసరావు గారు

కొత్త పెళ్ళికూతురి తళుకు వర్ణించ జాలిన కవి పుట్టలేదూ, పుట్టబోడు అన్నారు సాక్షి వ్యాసకర్త. ఐనా సరేనని ప్రయత్నించారు రోహిణి గారు.

సుబ్రమణి గారి గేయం చదువుతుంటే 'నిన్ను నిన్నుగా ప్రేమిచుటకూ నీకోసమె కన్నీరు నింపుటకు, నేనున్నానని నిండుగా పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ' అన్నది నిత్య సత్యంకదా అనిపించింది .

అజాద్ గారు మనం చేస్తున్న పర్యావరణ భీభత్సాన్ని బాగా వర్ణించారు.

సూర్యనారాయణ గారు, జీవితం మనని మోసం చేస్తోందా, మనం జీవితాన్ని మోసం చేస్తున్నామా, మననే ఆలోచించుకోమన్నారు. No man is a hero to his children అన్నది ఒక english సామెత. దాన్ని తలకిందులు చేశారు సూర్య నారాయణ గారు.

★★★ ||| ★★★

## సంపాదక వర్గం

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (Editor), ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్, బొగ్గవరపు లవకుశ, తిప్పాభొట్ల రవిశంకర్, తోడుపునూరి శ్రీనివాస్

## BOT Representatives

తాతా వేంకట సత్య

# విషయ సూచిక


| | |
|---|---|
| అధ్యక్షుని కలం నుండి | 3 |
| సంపాదకీయం | 4 |
| నవజీవన భాష్యాలు! | 6 |
| సంగీత త్రిమూర్తుల ఆరాధనోత్సవాలు | 9 |
| వంకాయ వంటి కూరయు.......! ... కుంతి | 11 |
| ప్రేమ పూలు ... జి వి రమణ | 15 |
| తెలుగు వారమండీ ...ప్రొ. మలయవాసిని | 17 |
| కొంత వెలుగు కొన్ని చినుకులు ... సుంకర గోపయ్య | 19 |
| సమాజం మారుతుంది సమూలంగా... కొమ్ముల వెంకట సూర్యనారాయణ | 19 |
| తెలుగుదనం ... డా. వైదేహి శశిధర్ | 20 |
| కుసుమ ... శింగరాజు శ్రీనివాసరావు | 22 |
| ఉగాది సంబరాలు | 28 |
| మమతల దారుల్లో... వంజారి రోహిణి | 35 |
| మనం అనుకుంటాం గాని ... పాండ్రంకి సుబ్రమణి | 35 |
| ఏ ఊరు ఏ తీరు ఓ తెలుగు మనిషీ!! ... దాసరి అమరేంద్ర | 36 |
| స్వయంకృతం ... పి. చంద్రశేఖర అజాద్ | 39 |
| పశ్చాత్తాపం ... కొమ్ముల వెంకట సూర్యనారాయణ | 42 |
| నాన్నా నువ్వే నా హీరోవి ... కొమ్ముల వెంకట సూర్యనారాయణ | 44 |


Opinions expressed in this volume are those of the authors and not of TFAS.

## నవజీవన భాష్యాలు!

కంప్యూటరు స్పృశించు కరములు కరములు
సెల్ఫోనులో వాగు జిహ్వ జిహ్వ
వాట్సాపు చూచెడి వాల్గంటి వాల్గంటి
వెంటనే లైక్ కొట్టు వేలు వేలు
ట్విట్టరులో పెట్టి తిట్టు తిట్టే తిట్టు
ఫేసు బుక్కై పోవు ఫేసు ఫేసు
వీడియో చాటింగు విద్యార్థి విద్యార్థి
స్మార్ట్ ఫోను చెప్పెడి చదువు చదువు

ఆరు సిమ్ముల వాడె పో ఆధునికుడు
అప్పులెగ్గొట్టు వాడె పో గొప్పవాడు
ఇవి ఎరుంగని వాడె పో చవట యనగ
నాగరికమున సర్వము నాశమగుటె
ఆధునికాంధ్ర మహా భాగవతమిట్లుండునొకో?

enjoy the original of which you read a titillating spoof:
[http://telugubhagavatam.org/?tebha&Skanda=7&Ghatta=6&Padyam=169](http://telugubhagavatam.org/?tebha&Skanda=7&Ghatta=6&Padyam=169)

**సభ్యులందరికీ ఉగాది శుభాకాంక్షలు.**

మహారాజ పోషకులు శ్రీమతి కొల్లూరి గిరిజ, శ్రీ కొల్లూరి రామ్ గార్లు



## శ్రీ కల్యంపూడి రాధాకృష్ణారావు గారికి ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ పురస్కారం

ప్రపంచ ప్రఖ్యాత స్టాటిస్టిక్స్ నిపుణుడు, భారతీయ-అమెరికన్ గణాంక వేత్త శ్రీ కల్యంపూడి రాధాకృష్ణారావు గారికి 102 సంవత్సరాల వయస్సులో గణాంక శాస్త్ర రంగంలో నోబెల్ గా భావించే ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ అవార్డు 2023 సంవత్సరానికి అరుదైన గౌరవం దక్కింది. 75 సంవత్సరాల క్రితం రావు గారు చేసిన కృషి ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూనే ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.



వచ్చే జులైలో కెనడాలో ఒంటారియోలోని ఒట్టావాలో జరిగే ద్వైవార్షిక ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ వరల్డ్ స్టాటిస్టిక్స్ కాంగ్రెస్‌లో జరిగే ఈ కార్యక్రమంలో సీఆర్ రావు గారు ఈ అవార్డును అందుకుంటారు. ఆధునిక గణాంకాల రంగానికి మార్గం సుగమం చేసిన సీఆర్ రావు గారు మూడు ప్రాథమిక ఫలితాలను పరిశోధించారు. మొదటిది క్రామెర్రావ్ బౌండ్, రెండవది రావుబ్లాక్‌వెల్ సిద్ధాంతం. ప్రముఖ గణాంకవేత్త డేవిడ్ బ్లాక్‌వెల్ ద్వారా స్వతంత్రంగా కనుగొన్నందు వల్ల ఒక అంచనాను మెరుగైన వాస్తవానికి సరైన అంచనాగా మార్చడానికి. చివరిది సమాచార జ్యామితిగా అభివృద్ధి చెందిన కొత్త ఇంటర్ డిసిప్లినరీ ఫీల్డ్‌కు మార్గదర్శకత్వం. ఈ ఫలితాలు శాస్త్రవేత్తలు డేటా నుంచి సమాచారాన్ని మరింత సమర్థవంతంగా సేకరించేందుకు సహాయపడతాయని ఆ ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత శక్తివంతమైన కణ యాక్సిలరేటర్ అయిన లార్జ్ హాడ్రాన్ కొలైడర్ వద్ద హిగ్స్ బోసాన్ కొలతలను అర్థం చేసుకోవడానికి ఆప్టిమైజేషన్ చేయడానికి సమాచార జ్యామితి ఇటీవల ఉపయోగించారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడిన ఆయన ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. హైదరాబాద్‌లోని సీఆర్‌రావ్ అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ వ్యవస్థాపకులైన సీఆర్ రావు గారు 1920 సెప్టెంబర్ 10న బళ్లారి జిల్లా హడగళిలో జన్మించారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నూజివీడు, నందిగామల్లో ఆయన బాల్యం గడిచింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ చేసిన ఆయన, యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటిస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. సీఆర్ రావు సేవలు కేవలం స్టాటిస్టికల్ రంగానికే కాకుండా ఎకనమిక్స్ జెనిటిక్స్ ఆంత్రోపాలజీ తదితర రంగాలకూ విశేషంగా ఉపయోగపడినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. 19 దేశాలనుంచి 39 డాక్టరేట్లు అందుకున్న ఆయన ఇప్పటివరకు 477 పరిశోధన పత్రాలు సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారం అందుకున్నారు. యుకే ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్ ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటిస్టిక్స్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రొఫెసర్ రావును భారత ప్రభుత్వం 1968లో పద్మభూషణ్ 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

ఈ అరుదైన పురస్కారాన్ని అందుకోనున్న శ్రీ కల్యంపూడి రాధాకృష్ణారావు గారికి తెలుగు కళా సమితి కార్యవర్గం ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియచేస్తున్నారు.

RK Jewels
Iselin, NJ

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey, USA**

# TriMurthy Day
## CELEBRATIONS





*Delicious Lunch Served*

*Entry Free*

**Date:** March 12th, 2023 (Sunday)
**Time:** 9:00 am to 5:00 pm

**Venue:**
Tagore Hall – Ananda Mandir
269 Cedar Grove Lane,
Somerset, NJ, 08873.

*Pooja followed by Group Singing (All are welcome)*

**TRINITY COMPOSITIONS :**

Vathapi, Jagadanandakaraka, Kanakanaruchi, Yendaro Mahanubhavulu, Kamakshi Swarajathi

| Sri Thyagaraja Compositions | Sri Dikshitar Compositions Group Participation | Sri Shymasastri Compositions Group Participation |
|---|---|---|
| Concert on Sri Thyagaraja Compositions<br>Smt. Vijayalalitha Susarla - Vocal<br>Smt. Sandhya Anand - Violin<br>Sri Harish Dorai – Mridangam | Concert on Sri Dikshitar Compositions<br>Chy. Anirudh Koneru - Vocal<br>Kum. Sweta Narasimhan - Violin<br>Sri Rajagopal Sundareswaran - Mridangam | Concert on Sri Shyama Sastri Compositions<br>Smt. Radhika Devarajan - Violin<br>Sri Keerthi Venkatramani - Mrindangam |

digitalaya • +91 9246578478

**Attendee Registration:**
https://tinyurl.com/TriMurthy2023Attendees

Supporters / Sponsors

HELP FOUNDATION – HEALTH AND EDUCATION FOR LESS PRIVILEGED
BHOG – Redefined Indian Cuisine
POLEPALLE FOUNDATION

**For additional information:**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Anu Dasari: (908) 907 1502
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025
Jaya Chikka: (201) 317 1166 Bhanu Rekha Brahmasamudram: (732)-5130716

# న్యూజెర్సీ లో వైభవంగా జరిగిన సంగీత త్రిమూర్తుల ఆరాధనోత్సవాలు

అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో సోమర్సెట్ నగరం లోని ఆనంద్ మందిరం ఆడిటోరియం లో 2023 మార్చి12 వ తేదీన సంగీత త్రిమూర్తుల ఆరాధనోత్సవాలను తెలుగు కళా సమితి కార్యవర్గం వారు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం మరియు మెంబర్ షిప్ కార్యదర్శి శ్రీమతి జ్యోతి కామరసు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి సుమారు 400కు పైగా సంగీత రసజ్ఞులు ఉత్సాహంగా కదలకుండా కూర్చుని సభని జయప్రదం చేశారు.



ముందుగా ఈ కార్యక్రమాన్ని పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ గారి అధ్వర్యంలో గణపతి ఆరాధన, శ్రీ రామ పరివారం మరియు సంగీత త్రిమూర్తులకు






















షోడశోపచార పూజలు చేసి ఆరంభించారు. తదుపరి త్రిమూర్తుల కీర్తనల గోష్టి గానం, శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి రచన 'వాతపిగణపతింభజే ' తో ఆరంభించి శ్రీ త్యాగరాజ రచించిన కీర్తనల నుండి జగదానంద కారకా-నాట రాగము, కన

కన రుచిరా-వరాళిరాగము, ఎందరో మహానుభావులు-శ్రీరాగములతో ముందుకు సాగించి, శ్రీ శ్యామశాస్త్రి రచించిన కామాక్షి స్వరజతితో ముగించారు. . న్యూజెర్సీ చెందిన బాలబాలికలతో, కళాకారులతో నిండిన వేదిక, వారు ఆలాపించిన గోష్టి గానం వీనుల విందుగా, కన్నుల పండుగగా రసజ్ఞులను సమ్మోహితులను చేసింది.

శ్రీ శ్యామశాస్త్రి గారి రచనలను శ్రీమతి రాధిక దేవరాజన్ గారి బృందం వయోలిన్ తో వాద్య కచేరి చేయగా, శ్రీమతి విజయ లలిత సుసర్ల గారి బృందంతో త్యాగరాజ గారి కృతుల గాత్ర కచేరి, చిరంజీవి అనిరుధ్ కోనేరు బృందంతో శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి రచనల గాత్ర కచేరి లతో ప్రాంగణం ప్రతిధ్వనించింది. శ్రీమతి సంధ్య ఆనంద్, కుమారి శ్వేతా నరసింహన్ వయోలిన్ సహకారం అందించగా, శ్రీ రాజా గోపాల్ సుందరేశ్వరన్, శ్రీ కీర్తి వెంకటరమణి మృదంగం సహకారం అందించారు. ఉ| 9.00 గంటల నుండి సా 6.45 గంటల వరకు సంగీత, నాద స్వర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, స్థానిక కళాకారులు (ఇరవై బృందములు) సుమారు 100 సంగీత త్రిమూర్తుల అపురూప కృతులు, కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. .

తెలుగు కళా సమితి నిర్వహించిన ఈ సంగీత త్రిమూర్తుల

ఆరాధనోత్సవాలను హెల్ప్ ఫౌండేషన్, పోలేపల్లి ఫౌండేషన్ వారు సంయుక్తంగా స్పాన్సర్లు గా, భోగ్ రెస్టారెంటు వారు ఫుడ్ స్పాన్సర్స్ గా వ్యవహరించారు. ఈ సంస్థ ల ప్రతినిధులు శ్రీ పోలేపల్లి శంకర రావు గారు, శ్రీమతి సునీతా మాకం గారు మాట్లాడుతూ, తమకు కర్ణాటక సంగీతం అంటే ఎంతో అభిమానం, పంచ రత్న కృతులను ప్రతి ఒక్కరు నేర్చుకుని, భావి తరాలకు అందించాలన్నారు. తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ మధు రాచకుళ్ళ  మాట్లాడుతూ ఈ సంగీత త్రిమూర్తుల శాస్త్రీయ సంగీతాన్ని అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లల్లో వ్యాపింపచేసి అజరామరం చేయటానికి తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. నూజెర్సీలో గత ముప్పది సంవత్సరములకు పైగా ఈ త్రిమూర్తుల ఆరాధనోత్సవాలను నిర్వహించినందుకు శ్రీమతి కౌతా సీమంతిని మరియు శ్రీమతి ప్రభా రఘునాధ్ గార్లకు







అభినందనలు తెలుపుతూ తెలుగు కళా సమితి కార్య వర్గం ప్రత్యేకంగా సత్కరించారు. తెలుగు కళా సమితి మెంబర్ షిప్ కార్యదర్శి శ్రీమతి జ్యోతి కామరసు, శ్రీమతి భానురేఖ బ్రహ్మసముద్రం మరియు శ్రీమతి జయా చిక్కా కళాకారులను, అధ్యాపకులను, కార్యవర్గ సభ్యులను సమన్వయ పరిచి కార్యక్రమాన్ని సమర్ధవంతముగా నిర్వహించి అందరి మన్ననలను పొందారు. కార్యక్రమానికి  శ్రీ రఘు శంకరమంచి, భోగ్ రెస్టారెంటు నుంచి శ్రీ శ్రీనివాస్ గంటా, శ్రీ ఉపేంద్ర చివుకుల, శ్రీ దాము గేదల, శ్రీ పుండరీక, శ్రీ శ్రీనాధ్ కోనంకి చౌదరి, శ్రీమతి శివాని, లక్ష్మి పాత్రుని,  శ్రీ ఓం మడూరి గార్లు అతిధులుగా విచ్చేసారు.

కమ్యూనిటీ కార్యదర్శి వెంకట సత్య తాతా వెండర్ స్టాల్స్ ని; ఉపాధ్యక్షురాలు శ్రీమతి అనూరాధ దాసరి వాలంటీర్లుని; ఉపాధ్యక్షురాలు శ్రీమతి బిందు యలమంచిలి మీడియా వ్యవహారాలను; కార్యదర్శి శ్రీ రవి అన్నదానం కార్యక్రమ నిర్వహణ వ్యవహారాలను;  కోశాధికారి శ్రీ శ్రీనివాస్ చెరువు ఆడియో, బ్యానర్స్ మరియు కొనుగోలు వ్యవహారాలను; ఐటి కార్యదర్శి శ్రీ నాగ మహేందర్ వెలిశాల భోజన ఏర్పాట్లని పర్యవేక్షించారు.

కార్యక్రమానికి ఆర్ధిక సహాయం చేసిన స్పాన్సర్లు హెల్ప్ ఫౌండేషన్, పోలేపల్లి ఫౌండేషన్ మరియు భోగ్ రెస్టారెంటు వారికి, ఈ వేడుకలను చిత్రీకరించిన ఫోటోగ్రాఫర్ ఆనంద్ గారికి మరియు సుందర్ (మనటివి) గారికి, రుచికరమైన భోజనమిచ్చిన భోగ్ రెస్టారెంటు వారికి, మీడియా మిత్రులకు  తెలుగు కళా సమితి కార్యవర్గం ధన్యవాదములు తెలియచేసింది. కార్యక్రమాన్ని విజయానికి చేయూతనిచ్చిన  వాలంటీర్స్, శ్రీ ప్రభాకర్ కాటేపల్లి,



శ్రీమతి శ్రీవిద్య మానికొండ , శ్రీ హర్ష గొల్ల, శ్రీమతి ప్రతిభ ఇసుకపల్లి, శ్రీ అన్నాజీ వడ్లమాని, శ్రీమతి శ్రావణి మల్లాది, శ్రీమతి అర్పితా నూనె, శ్రీ సుధాకర్ ధూలిపాళ్ళ, శ్రీ రవి నారవ, శ్రీ రవి మహీధర, శ్రీమతి కాంతి పూసపాటి , శ్రీమతి లక్ష్మి చిత్ర సుంకు, శ్రీమతి సరితా వెల్లూర్, శ్రీమతి జలజ గొల్ల, శ్రీమతి ఉమా తురుమెళ్ళ గార్లకి, శ్రీమతి నాగమణి & వెంకట్ గ్రంధి దంపతులకు తదితరులకు తెలుగు కళా సమితి  ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేసింది. అందరికీ కార్యదర్శి శ్రీ రవి అన్నదానం పేరు పేరునా ధన్యవాదాలు చెపుతూ జనగణమన జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.

# వంకాయ వంటి కూరయు.......!

కుంతి

అంతకు ముందు రోజు వర్షం కురిసింది. మన కథానాయకుడు బుచ్చి బాబు ప్రేమగా పెంచుకున్న వంకాయ తోటలో పని చేసుకొంటూ, బురదలో కాలు జారి పడ్డాడు.తలకు బాగా దెబ్బ తగిలింది. స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు హాస్పిటల్ లో జాయిన్ చేసారు. ఐ సీయూ లో ఉంచారు.

ప్రముఖ స్పెషలిస్టులైన డాక్టర్లు వస్తున్నారు.జాగ్రత్తగా పరీక్షిస్తున్నారు. రకరకాల టెస్ట్ లు అవుతున్నాయి. బుచ్చిబాబులో మాత్రం చలనం లేదు.వచ్చిన డాక్టర్లు వాళ్లల్లో వాళ్ళు మాట్లాడుకుంటూ,గంభీరంగా వెళ్లిపోతున్నారు.ఐసీయూ కు అవతల లాంజ్ లో కుటుంబ సభ్యులు భారమైన గుండెలతో దైవ ప్రార్ధనలు చేస్తున్నారు. బుచ్చిబాబు బామ్మ సీతమ్మ ఒడిలోఆతని భార్య పంకజం తల పెట్టుకొని తీవ్రంగా దుఃఖిస్తున్నది.

సీతమ్మ పలు విధాలుగా ధైర్యం చెబుతున్నది.

గతరాత్రి నుండి తిండీ నిదుర లేకుండా పోవడం చేత, పంకజం యేడుస్తూ, యేడుస్తూ మగత నిదురలోకి వెళ్ళింది. సీతమ్మ కుర్చీకి ఆనుకొని కళ్లు మూసుకున్నది.

.............................

బుచ్చిబాబు అన్నప్రాశన వేడుక అద్భుతం గా జరుగుతుంది. తరువాత బుచ్చిబాబు తల్లి వసారాలో అందమైన కార్పెట్ పరిచింది.

"బుచ్చిగాడు నాలాగా కోర్టు గుమాస్తా కావద్దు పెద్ద లాయర్ కావాలి" అంటూ ఒక పెద్ద లా పుస్తకం తెచ్చిపెట్టాడు బుచ్చిబాబు తండ్రి సదా శివం.

"బుచ్చిగాడు మా అన్నయ్య లాగా పెద్ద డాక్టర్ కావాలి" అంటూ స్టెత స్కోప్ తెచ్చిపెట్టింది బుచ్చిబాబు తల్లి తాయారు.

"లేదు..లేదు.. ఘంటం వారి వంశం లో పుట్టాడు. కాబట్టి వీడు చాలా పెద్ద కవి కావాలి" అంటూ రెండు కావ్యాలు, ఒక మంచి కలం తెచ్చిపెట్టాడు బుచ్చి బాబు చిన్నాన్న.

"లేదు...లేదు ... బుచ్చిగాడు పెద్ద ఇంజనీర్ కావాలి" అంటూ టీ స్కైర్ తెచ్చి పెట్టింది మేనత్త.

"లేదు...లేదు .... ఈ చదువులూ.... ఉద్యోగాలు.... కవిత్వాలు ఎవరికి కావాలి. పైసాయే పరమాత్మ! కాబట్టి వీడు పెద్ద వ్యాపారాలు చేసి, కోట్లు గడించాలి" అంటూ కొన్ని నోట్ల కట్టలు, బంగారు గొలుసు పెట్టాడు పెదనాన్న.

బుచ్చి బాబు పెరిగి పెద్ద వాడయి ఎవరెవరు యేమేమి కావాలని కోరుకుంటున్నారో, తదనుగుణమైన వస్తుజాలాన్ని కార్పెట్ మీద పెట్టారు. బుచ్చి బాబు తల్లి బుచ్చి బాబును కిందపడుకో బెట్టింది.

అందరూ బుచ్చిబాబుకు చుట్టూర నిల్చొని, 'అది ముట్టుకో నాన్నా...' 'ఇది పట్టుకో నాన్నా....' అంటూ స్టేడియం లో ఆటగాళ్లను ప్రోత్సహించే ప్రేక్షకులలాగా హంగామా చేయ సాగారు.

అప్పటికే మధ్యాహ్నం అయింది. భోజనాల వేళ అయింది.వచ్చిన అతిధులందరికీ షడ్రసోపేతమైన వంటలను ఒక్క చేతితో వండిన బుచ్చి బాబు బామ్మ సీతమ్మ, చేసిన పదార్ధాలన్నీ వంటింటి నుండి హాల్ లోకి ఒక్కొక్కటీ తెచ్చి పెడుతుంది.

అలాగే అపుడే చేసిన ఘుమఘుమలాడే గుత్తి వంకాయ కూర గిన్నె తీసుకొని వస్తూ, కాలికి యేదో తగలడంతో ముందుకు తూలింది. చేతిలో గిన్నె కొద్దిగా జారినట్లయింది. కింద పడకుండా వడిసి పట్టుకున్నప్పటికీ, అందులో నుండి నోరూరిస్తున్న,సువాసనా భరితమైన , రచికరమైన వంకాయ ముక్క వెళ్ళి కార్పెట్ పైన పడింది.

అంత వరకు జడ్డిగా ఉండి, అందరి ఆఫర్లను,ఎంకరేజ్ మెంట్లను స్వీకరించని బుచ్చి బాబు వెంటనే పాక్కుంటూ వెళ్ళి వంకాయ ముక్కను నోట్లో పెట్టుకున్నాడు.

అందరూ నిరుత్సాహ పడ్డారు.

తన చేతి వంకాయ కూర బుడతడికి కూడా నచ్చినందుకు, తాను చేసిన వంకాయ కూరపై ప్రేమ ప్రవాహం ఇంకొకతరానికి కొనసాగుతున్నందుకు సీతమ్మ సంతోష పడింది.

బుచ్చిబాబు స్కూల్ కు వెళ్ళే రోజులలో వాళ్ళ అమ్మ ఎన్ని రకాల పోషక పదార్థాలతో కూడిన వంటలు చేసినా

తినకపోయేవాడు. మూడుపూటలా బామ్మతో చెప్పి వంకాయ ఆవకాయ, వంకాయ పచ్చడి, వంకాయ పులుసు, నూనె వంకాయ, నువ్వు వంకాయ వంటి ఆదరువులు చేయించుకునేవాడు. చివరకు సాంబార్ తోపాటుగా, పప్పులో, చారులో వంకాయలు వేయాలని పట్టు పట్టే వాడు. సాయంత్రము స్నాక్స్ లో వంకాయ బజ్జీ, సెలవు రోజులలో వంగీబాత్ లాంటివి అడిగి మరీ చేయించుకునేవాడు.

వీడి వంకాయ పిచ్చిని చూసి ఇంటిలో వాళ్ళు తలపట్టుకునే వారు.

బామ్మ సీతమ్మ గారు మాత్రం తన భర్త మహాశివయ్య కూడా వంకాయ ప్రియుడు కావడం, ఆ లక్షణాలు మనవడిలో రావడం తో సంతోషించేది. అతని పిచ్చికి చికాకు పడకుండా రోజుకు ఒక వంకాయ వంటకం చేసి పెడుతుండేది. అంతే కాక వాళ్లనూ, వీళ్లనూ అడిగి కొత్తకొత్త వంటకాలను నేర్చుకొని మరీ చేసి పెట్టేది.

స్కూళ్ళో బుచ్చిబాబును 'వంకాయ' అని నిక్ నేమ్ తో పిలుస్తూ, నవ్వులాటకు దిగేవారు

"నవ్విపోదురుగా కా నాకేటి సిగ్గు "అనుకునేవాడు.

బుచ్చిబాబు కాలేజీకి వచ్చాడు. ఇంటర్ లో బైపీసీ తీసుకున్నాడు. ఎమ్ సెట్ రాసాడు. వైద్య కళాశాలో సీటు వచ్చినా వెళ్ళలేదు. అగ్రి కల్చరల్ బీఎస్ సీ, దానిలోనే ఎమ్ ఎస్ సీ చేసాడు.

ఆపై తనకు ఇష్టమైన వంకాయ తో పాటు బంగాళ దుంపపై కూడా పరిశోధన చేసి, వంకాయ మొక్కకు, బంగాళ దుంపల పిలకలకు మధ్య జత కట్టించి " సొలానము మెలనో ట్యుబరోస్" అనే సరికొత్త వంగడాన్ని సృష్టించాడు.

పీ హెచ్ డీ పట్టా పొందాడు. ఆ పై పీడీ పట్టా పొందాడు.

చదువుతో పాటుగా పాక శాస్త్ర ప్రావీణ్యం పెంచుకొని, కుటుంబంలో యేపైనావేడుకలు జరిగినపుడు, ధోవతి పైకి ఎగజెక్కి, గరిటె చేత బట్టుకొని, బంధుజనులకు రకరకాల వంకాయ వంటకాల రుచిని చూపించేవాడు.

ఆ మధ్య ఒక టీవీ షో లో "వంకాయతో వంటకాలు" పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి కూడా పొందాడు.

దానితో అతని పేరు ఘంటం బుచ్చి బాబు కాస్తా వంకాయల బుచ్చిబాబుగా మారిపోయింది.

అతనిని యెరిగిన ఆధునిక తెలుగు భాషాప్రియులు 'నలభీమ పాకం' అనే జాతీయానికి బదులుగా బుచ్చిబాబు పాకం అని వాడుతున్నారు.

బుచ్చి బాబు అత్యున్నత పరిశోధనలకు అబ్బుర పడిన విదేశీ విశ్వ విద్యాలయాలు అతనికి పెద్ద పెద్ద ఉద్యోగాలను ఆఫర్ చేసాయి. అయితే దానితో పాటు స్వరాష్ట్రంలో,స ్వస్థలం లో వంకాయలపై మరిన్ని పరిశోధనలు చేసే అవకాశం రావడంతో ఉన్న ఊళ్ళో ఉద్యోగం చేసుకుంటూ, ఇంటి వెనుక ఉన్న పెద్ద పెరడులో వంకాయ తోట పెంచుకుంటూ కాలం గడుపుతున్నాడు.

........................

బుచ్చిబాబుకు పెళ్లి సంబంధాలు రాసాగాయి. అతనికి యే పిల్లా నచ్చలేదు. ఇలా ఉండగా ఉన్న ఊళ్ళోనే ఒక పెళ్లి సంబంధం వచ్చింది. బుచ్చిబాబు కుటుంబ సమేతంగా పెళ్లి పిల్లను చూడడానికి వెళ్లాడు. అమ్మాయి బాగా చదువుకున్నది. కానీ నల్లగా ఉన్నది. బుచ్చిబాబు తల్లిదండ్రులకు ఆ అమ్మాయి పెద్దగా నచ్చలేదు. అమ్మాయి తండ్రి, "అబ్బాయీ, అమ్మాయీ యేదైనా మాట్లాడుకోవాలనుకుంటే ఇద్దరూ మేడమీద గదిలోకి వెళ్ళి యథేచ్ఛగా మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. పరస్పరం మరింతగా పరిచయాలు చేసుకున్నారు.ఇద్దరూ బాగా చదువుకున్నవారే కాబట్టి సిగ్గూ,బిడియాలు లేకుండా చదువులూ,ఉద్యోగాల గురించి మాట్లాడుకున్నారు. ఆలోచనలు పంచుకున్నారు. అభిరుచులు తెలుసుకున్నారు.

చివరగా మన బుచ్చిబాబు "ఇలా అడుగుతున్నానని యేమీ అనుకోవద్దు. కోటి విద్యలు కూటికొరకే. తిండికలిగితే కండ కలదు. యే పాటు తప్పినా సాపాటు తప్పదు అంటారు. మీకు శాకపాకాల్లో యేది ఇష్టం.మీ జిహ్వాకు బాగా యేది రుచిస్తుంది"అన్నాడు

అమ్మాయి నవ్వుతూ, "నా మనసులో మాట చెబుతున్నాను. నాకు వంకాయతో యే రకమైన చేసిన ఇష్టమే,కేవలం వంకాయ మీద ప్రేమతో వంట చేయడం

నేర్చుకున్నాను. ఉద్యోగ బాధ్యతలతో ఎంత తీరిక లేకున్నా, వంకాయతో యేదో ఒక వంటకం చేసి, అందరికి తినిపిస్తే నాకు అదో తృప్తి. ఈ మధ్య మా కాలనీ అసోసియేషన్ వారు 'వంకాయలతో వంద రకాల వంటకాలు' అనే పోటీ పెట్టారు. నేను నూటాపదహారు రకాల వెరైటీలు చేసి ఆ పోటీలో బహుమతి పొందాను. అంతేకాదు అందులో నేను చేసిన వంకాయ స్వీట్ కూడా అందరూ తెగ మెచ్చుకున్నారు" అన్నది

కాపుకు వచ్చిన వంకాయ తోటలా శోభాయమానంగా కనిపిస్తున్న పెళ్లి కూతురును చూస్తూ, "మీరు నాకు తెగ నచ్చారు.మీకు నచ్చితే నా జన్మ ధన్యమైనట్లే" అన్నాడు

పంకజం సిగ్గు పడకుండా తన ఆనందాన్ని ప్రకటించింది.

"ఇంక మాట్లాడుకోవడాలు లేవు, పెళ్ళి చేసుకోవడాలే" అంటూ ఇద్దరూ గది నుండి బయటికి వచ్చారు. బుచ్చి బాబు తండ్రికి ఆ అమ్మాయి పెద్దగా నచ్చకపోవడంతో అక్కడి నుండి వెళ్లిపోదాము అన్నట్లుగా చూస్తున్నాడు. అది గమనించిన బుచ్చిబాబు "నాన్నా ! నాకు అమ్మాయి నచ్చింది. ముహుర్తాలు పెట్టించండి" అన్నాడు. బుచ్చిబాబు మొండి తనం తెలిసిన సదాశివం మౌనంగా తలూపాడు.

పెళ్ళికూతురు పంకజం తండ్రి "కట్నాలూ... కానుకలూ.... లాంచనాలూ...." అంటూ యేదో చెప్పబోయాడు.

"కట్నాలు, కానుకలూ యేమీ వద్దు పెళ్లి మాత్రం గుర్తుండిపోయేలా జరగాలి" అన్నాడు బుచ్చిబాబు.

"అంటే యేలా" అన్నాడు పంకజం తండ్రి

పెళ్లి హాలు ఊదా రంగు లైట్లతో, వంకాయ రంగు పరదాలతో ఉండాలి. భోజనములో వంకాయలతో చేసిన అన్ని రకాల వంటకాలు ఉండాలి. మా బామ్మ గారిచే గుత్తి వంకాయ కూర చేయించి, అది అతిధులందరికీ ఒక స్టీల్ బాక్స్ లో పెట్టి బహుమతిగా ఇవ్వాలి" అన్నాడు.

పంకజం బంధువులు "ఈ పిల్లవాడికి ఇదేమి పిచ్చి"అనుకున్నారు.

పిల్లవాడు చాలా గొప్ప శాస్త్ర వేత్త కావడంతో పెదవి విప్పలేదు.

"ఇక్కడా వీడి పైత్యాన్ని చూపుతున్నాడు" అని బుచ్చిబాబు తల్లిదండ్రులు అనుకున్నప్పటికీ మౌనంగా ఉన్నారు.

......................

పెళ్లి ఘనంగా బుచ్చిబాబు కోరిక మేరకు జరిగింది.నగరంలోని ఒక స్టార్ హోటల్ లో పంకజం తండ్రి శోభనం యేర్పాటు చేయాలనుకొని,బుచ్చిబాబు తో అదే మాట చెప్పాడు. కాని దానికి అతను అంగీకరించలేదు.

"నాకు మా ఊళ్ళో పెద్ద వంకాయ తోట ఉంది. అక్కడ ఒక పెద్ద ఫామ్ హౌజ్ ఉంది. అక్కడ అక్కడే శోభనం" అన్నాడు. పెద్దవాళ్ళకు అతని సంగతి తెలుసు కాబట్టి "అలాగే" అన్నారు.

శోభనం నాడు ఇరు వైపుల పెద్దలు ఫామ్ హౌజ్ కు వచ్చారు. ఫామ్ హౌజ్ తలుపులు,కిటికీలు వంకాయ రంగు పెయింట్ తో ఉన్నాయి. గోడలపై వివిధ రకాల వంకాయల బొమ్మల పేయింటింగ్స్ ఉన్నాయి. శోభనానికి యేర్పాటైన మంచం దుప్పటి పైన, దిండ్ల పైన వంకాయ బొమ్మలు ఉన్నాయి. మంచం పక్కన రొటీన్ గా ఉండే స్వీట్లు, పిండి వంటలకు బదులుగా వంకాయలతో చేసిన స్వీట్, వంకాయ బజ్జీలు ఉన్నాయి, ఇదంతా బుచ్చిబాబు తాను దగ్గర ఉండి యేర్పాట్లు చేయించుకున్నాడు.

ముత్తైదువలు పంకజాన్ని గదిలోకి పంపుతూ, అ వ్యవహారాన్ని చూసి, "వీళ్ళకి పిల్లలె పుడతారో,వంకాయలే పుడతాయో "అని మనసులో అనుకోని, నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

ఆరు నెలలు గడిచాయి.

సెలవు రోజు కావడంతో బుచ్చిబాబు ఇంటిలో ఉన్నాడు. వర్షం కురుస్తుంది. బాగా చీకటి పడింది. ఇంటి వెనుక పెరడు తలుపు తీసి ఉండడంతో పశువులు లోపలికి వచ్చాయి. ఒక పక్క వర్షం మరొక పక్క చీకటి. గందరగోళంలో పశువులు మొక్కల్ని తొక్కేసాయి. పశువులను తోలుదామని వచ్చిన బుచ్చిబాబు పెరడులో జారిపడ్డాడు

..............................................

అలికిడి కావడంతో సీతమ్మ అలోచనల నుండి తేరుకుంది.. పంకజం కూడా కన్నులు విప్పింది. అపుడే

ఐసీయూ నుండి సదాశివం బయటికి వచ్చాడు.

"యేమంటున్నారురా! డాక్టర్లు!" అడిగింది సీతమ్మ.

"సాయంత్రం వరకు చూస్తారట. లేకుంటే చాల ఖరీదైన లైఫ్ సేవింగ్ ఇంజక్షన్ యేదో ఉంటుందట. అది చేస్తారట" అన్నాడు బదులుగా.

సీతమ్మకు యేదో గుర్తుకు వచ్చినదానిలా అక్కడి నుండి లేచింది. "పంకజం నాతో రావే" అన్నది.

"ఇక్కడ ఇలా ఉంటే ఎలా రాను?"

"నీవు నాతో రా! కాస్తా కారు తోలిపెట్టు. వెంటనే వచ్చేద్దాము" అంటూ బలవంతంగా పంకజాన్ని లాక్కెళ్ళింది.

పంకజాన్ని తోవలో ఉన్న మార్కెట్ దగ్గర కారు ఆపమన్నది. మార్కెట్లోకి వెళ్ళి నిగనిగలాడుతున్న వంకాయలను కొన్నది. ఆపై ఇంటికి వెళ్లారు. ఒక గంటలో పంకజం తోడుతో వంకాయలతో ముందుగా గుత్తి వంకాయ కూర, ఆపై ఎన్ని వెరైటీల వంటకాలు చేయగలదో అన్నీ చేసింది. అన్నీ స్టీల్ బాక్స్ ల్లో సర్దింది.

దేవుని గదిలోకి వెళ్ళింది, "సంకటకాలే వెంకటరమణా" అంటూ తనకు తోచిన స్తోత్రాలు చదివింది.

స్వామి వారి పాదాల వద్ద నున్న కుంకుమ తీసి పంకజం నుదుట దిద్దింది.

"ఇకపోదాము పద"అన్నది.ఇద్దరూ మళ్ళీ కార్ ఎక్కారు. కాసేపటిలో హాస్పిటల్ చేరుకున్నారు.

"యేమిటే ఎక్కడికి వెళ్లారు.ఇపుడు ఇవన్నీ ఎందుకు తెచ్చారు" అంటూ సదాశివం అంటున్నా, వినకుండా, సెక్యూరిటీ వాళ్లు అడ్డగిస్తున్నా పట్టించుకోకుండా సరాసరి ఐసీయూ లోకి వెళ్లింది.

సీతమ్మ ఒక బ్యాగు నిండా స్టీలు బాక్స్ లతో రావడం తో అక్కడవాళ్ళు అందరూ విచిత్రంగా చూస్తున్నారు.

ఆమె ఎవరినీ పట్టించుకోకుండా ఒక చేత్తో పంకజాన్ని మరొక చేత్తో బ్యాగును పట్టుకొని బుచ్చిబాబు మంచం దగ్గరికి చేరుకుంది. సీతమ్మ, పంకజం బుచ్చిబాబు మంచం దగ్గర చెరొక వైపు నిల్చున్నారు.

నిజానికి పంకజానికి ఇదంతా యేమీ అర్థం కావడం లేదు.

"బుచ్చీ !లేరా తండ్రీ! బామ్మను వచ్చాను. కళ్లు తెరువు" అంటూ ఒక్కొక్క బాక్స్ ను తెరిచి,బుచ్చిబాబు ముక్కు దగ్గర పెట్టి వాసన చూపిస్తూ,పంకజానికి అందిస్తున్నది. సీతమ్మ గారు చేసిన గుత్తివంకాయ కూర వాసన ఐసీయూలో చుట్టు ముట్టింది. ఆ వాసనతో, మృత్యువు అంచుల దాకా వెళ్లిన బుచ్చిబాబు శరీరంలో.

ఒక్కసారిగా చైతన్యం, చలనం వచ్చింది. మూలుగుతూ, కదిలాడు. మెల్లెగా కళ్లు విప్పాడు.

అతడు కళ్ళు తెరవడంతో సీతమ్మ, పంకజం ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నారు.

బుచ్చిబాబు ఇద్దరినీ చూస్తూ, "ఎందుకే యేడుస్తున్నారు. నేను ఇంత దానికే చచ్చిపోతానా? పైగా వంకాయ వంటి కూరయూ.........పంకజము, సీత వంటి బామ్మా మణియు ఉండగా..... అంటూ సున్నితంగా నవ్వాడు.

అప్పటికే అక్కడికి వచ్చిన డాక్టర్లు విషయాన్ని అర్థం చేసుకొని, "బామ్మగారు మీ మనవడిని మా మందులు, వైద్యం కాపాడలేదు, మీ అమృత హస్తాలతో చేసిన గుత్తి వంకాయ కూరయే రక్షించింది.ఇంక పేషంట్ కు భయములేదు. కొంత చికిత్స చేసి, కొన్ని గంటల్లోనే ఇంటికి పంపిస్తాం "అన్నారు.

"అయ్యా! గోంగూర శాకంబరీ దేవి వరప్రసాదమైతే, గుత్తి వంకాయ కూర సాక్షాత్తు అన్నపూర్ణాదేవి గారి మహా ప్రసాదం, మన తెలుగు వారి సంస్కృతికి చిరునామా. యేదో నా ప్రయత్నం నేను చేసాను. మీరే నా మనవడిని రక్షించారు నాయనా! మీ ఋణం ఎలా తీర్చుకోను"అన్నది

"మీ చేతుల మీదుగా మా స్టాఫ్ అందరికీ లంచ్ లో మీరు చేసిన గుత్తి వంకాయ కూర వడ్డించండి, అమృతత్వం పొందుతాం" అన్నాడు పెద్ద డాక్టర్ గారు.

"అలాగే నాయనా!" అంటూ దుఃఖాన్ని ఆపుకూంటూ, ఆనందంగా పంకజాన్ని తీసుకొని ఐ సీయూ నుండి బయటికి వచ్చింది.

..................

# ప్రేమ పూలు

జి వి రమణ

స్వప్నకీ ఆమె భర్త సత్యానికీ నిమిషం సరిపడదు. ఎప్పుడూ ఏదో ఒక గొడవ. సత్యం తననొక పని మనిషిలా తప్ప భార్యగా ఎప్పుడూ చూడడని స్వప్న అభిప్రాయం. అటువంటి గొడవే నెల రోజుల క్రితం చిలికి చిలికి గాలివానై కోపంతో స్వప్న పుట్టింటికి వెళ్లిపోయింది.

ఇంతకీ స్వప్న, సత్యంలు ఈమధ్యే పెళ్లయిన కొత్త దంపతులేమీ కాదు. పాతిక సంవత్సరాల పైచిలుకు కాపురం వాళ్లది. ఒక కూతురు, ఈ మధ్యే ఆమె అత్తారింటికి కూడా వెళ్ళింది, వీళ్ళ గొడవలు మాత్రం ఇంకా ఆగలేదు, ఎప్పుడూ ఏదో తెలీని అహం ఇద్దరినీ ఆడిస్తూ వాళ్ల మధ్య ప్రేమ పూలని పూయకుండా అడ్డు పడుతోంది.

స్వప్న తల్లిదండ్రులు ఇంకా ఆరోగ్యంగా ఉండడంచేత పెళ్లయి ఇంతకాలమైనా ఆమెను ఇలా ఆదరిస్తూనే ఉన్నారు.

` "మొగుణ్ణి ఒంటరిగా ఎక్కువకాలం వదిలేయడం మంచిది కాదమ్మా, పైగా దీపావళి పండుగ కూడా వస్తోంది, రేపు మీ అమ్మాయీ, అల్లుడూ పండక్కి వస్తే నీ పరువు పోతుంది, కనుక నువ్వు వెంటనే మీ ఆయన దగ్గరికి వెళ్తే మంచిది" అని అనుభవంతో ముసలి వాళ్ళైన అమ్మా నాన్న చెప్పడంతో స్వప్న మొగుడి దగ్గరకి ప్రయాణమయ్యింది.

ఉదయానికల్లా ఇంటికి చేరవచ్చన్నట్లు రాత్రి బస్సుకి బయలుదేరింది.

బస్సు ఎక్కించడానికి తోడు వచ్చిన తమ్ముడికి 'బాయ్' చెబుతూ, "మళ్లీ రేప్పొద్దున్నుంచి పని మనిషి బ్రతుకు మొదలు" అనుకుంటూ సీట్లో కూలబడింది.

సరిగ్గా అప్పుడే ఆమె ఫోన్ మ్రోగింది, ఫోన్ ఆమె బ్యాగులో ఉండడం వల్ల బస్సు శబ్దం ఇతర శబ్దాల వల్లా ఆమెకు ఫోన్ వినపడలేదు, ఫోన్ చేసింది ఆమె భర్త సత్యమే. తన ఆలనా పాలనా చూడకుండా ఆమెకు ఇష్టం అయినప్పుడు పుట్టింటికి వెళ్ళి పోవడం మళ్ళీ ఆమెకిష్టం వచ్చినప్పుడు రావడం సత్యానికి చాలా కోపం తెప్పిస్తోంది. ఆ విషయంగా గొడవ పడి, ఆమెను తిరిగి రాకుండా చేసి, తను కూతురు దగ్గరకైనా, ఇంకెక్కడికైనా వెళ్ళి ఆమెను ఏడిపిద్దామనే ఇప్పుడు ఫోన్ చేశాడు, అదృష్టవశాత్తూ ఆమె ఆ ఫోన్ ఎత్తలేదు, ఎత్తి ఉంటే మళ్ళీ కోపం వచ్చి బస్సు ఆపించి మరీ వెనక్కి వెళ్ళేదేమో?

తర్వాత స్వప్న నిద్రలోకి జారుకోవడం సత్యం మరో రెండుసార్లు ఫోను చేయడం ఆమెకు వినబడక పోవడం జరిగింది. చేసేది లేక సత్యం కూడా నిద్రకుపక్రమించాడు.

తెల్లవారుజామున ఐదు గంటలకు మెలకువ వచ్చింది సత్యానికి, భార్య రాత్రి తిరుగు ప్రయాణం అయ్యిందని గుర్తుకొచ్చి ఈ పాటికి నిద్రలేచి ఉంటుందిలే అని ఒకసారి ఫోన్ చేశాడు.

నో రిప్లై, రాత్రి ఆవిడ ఎక్కిన బస్సు తాలూకు టిక్కెట్టు, ట్రావెల్స్ వివరాలన్నీ బావమరిది వాట్సాప్ చేయడంతో అది ఓపెన్ చేసి బస్సు ఎన్ని గంటలకి గమ్యం చేరుతుందో చూశాడు. ఉదయం ఏడు గంటలకు అని ఉంది. ఇంకా టైమ్ ఉంది కదా అని కాసేపు ఆగి మళ్ళీ ఒకసారి ఫోన్ చేశాడు. నో రిప్లై.

అలా అయిదు నిమిషాలకొకసారి అయిదారు సార్లు చేసినా జవాబు రాకపోవడంతో మనసేదో కీడు శంకించింది. బస్సు క్షేమంగా వస్తోందా లేక ఏదైనా ప్రమాదం... అమ్మో ఆ ఆలోచనే భయంకరంగా అనిపించి బావమరిది పంపించిన వాట్సాప్ ఆధారంగా ఆ ట్రావెల్స్ వాడికి ఫోన్ చేసి బస్సు నెంబరు వివరాలు చెప్పి, "బస్సు క్షేమంగా సమయానికి వస్తోందా?" అని అడిగాడు.

"ఆఁ, వస్తోంది" అని వాడు ఫోన్ పెట్టేయబోతున్నంతలో, "బాబ్బాబు, కాస్త ఆ బస్సు డ్రైవర్ ఫోన్ నెంబరు ఇవ్వగలరా?" అని అడిగాడు.

"అలా ఎవరికి బడితే వాళ్ళకి ఇవ్వడం కుదరదు ఇంతకీ మీరెవరు?"

"ఆ బస్సులో మా ఆవిడ వస్తోంది ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తడం లేదు ఆమెకు ఆరోగ్యం సరిగ్గా ఉండదు, ఒక్కతే వస్తోంది, ఎలా ఉందో తెలుసుకోవాలి అందుకని".

చిన్న అబద్ధం ఒక్కోసారి పెద్ద పనులు చేసి పెడుతుంది.

అవతలి వాడు ఏమనుకున్నాడో, "ఇంతకీ మీ ఆవిడ పేరు ఏమిటో చెప్పండి" అని వివరాలు కన్ఫర్మ్ చేసుకుని డ్రైవర్ నెంబర్ ఇచ్చాడు.

* * * *

ప్రక్కనే కూర్చున్న హెల్పర్ కి ఫోన్ ఇచ్చి బస్సులో స్వప్న ఎవరో కనుక్కొని ఫోన్ ఆవిడకి ఇవ్వమని చెప్పాడు డ్రైవరు.

హెల్పరు డ్రైవర్ కేబిన్లోంచి ప్రయాణికుల భాగం లోకి వచ్చి "ఇక్కడ స్వప్న ఎవరూ?" అంటూ గట్టిగా అరిచాడు.

ఆ అరుపుకి బస్సులో అందరూ ఉలిక్కిపడి లేచారు.

ముందు వరుసలో కూర్చున్న దుర్వాసుడు, పక్కనే బాంబు పేలినట్లు భయపడి, "అందరూ నిద్రపోతుంటే, ఏమిట్రా నీ అరుపులు" అంటూ హెల్పర్ మీద విరుచుకుపడ్డాడు.

"క్షమించండి, ఇది ఆడవాళ్లతో వ్యవహారం, నిద్రపోతున్న ఆడవాళ్లని తట్టి లేపి పేరడిగే ధైర్యం నాకు లేదండి" అని, "ఇక్కడ స్వప్న ఎవరండీ" అంటూ మళ్ళీ గావు కేక పెట్టాడు.

బస్సులో అందరూ ఆ శాల్తీ ఎవరా అని బస్ అంతా చూశారు.

"నేనే, ఏం జరిగింది?" అంటూ భయం భయంగా అడిగింది స్వప్న.

"మీకు ఫోన్ లేదా? ఎవరో మీ కోసం మాకు ఫోన్ చేశారు, ఇదిగో మాట్లాడండి" అంటూ విసుగ్గా / విసురుగా ఫోన్ స్వప్న చేతిలో పెట్టాడు.

"హలో ఎవరూ?" అడిగింది.

"నేనే నీ మొగుణ్ణి, ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తవేమిటి, నువ్వు వచ్చే బస్సుకి ఏదైనా యాక్సిడెంట్ అయి నీకేమైనా జరిగిందేమోనని దేవుణ్ణి ప్రార్థిస్తూ కూర్చున్నాను, నీ దగ్గర ఫోను ఉండగా డ్రైవర్ నెంబర్ కనుక్కొని ఫోన్ చేయాల్సిన ఖర్మ పట్టింది " అన్నాడు కోపంగా.

"కాసేపట్లో ఇంటికి వస్తున్నాగా, మాట్లాడుకుందాంలెండి" అని ఫోన్ ఆఫ్ చేసి హెల్పర్ కి ఇచ్చేసింది, అంతకన్నా ఆ సమయంలో అక్కడ ఎక్కువ మాట్లాడితే బాగోదని.

'ఓస్ ఈ మాత్రానికేనా ఇంత సీను' అన్నట్టు చూశారు బస్సులో వాళ్ళంతా.

దుర్వాసుడి చూపుకి శక్తి లేదు గానీ, ఉంటే స్వప్న భస్మం అయ్యిపోయేదే.

అప్పుడు తన ఫోన్ తీసి చూసుకుంది. సత్యం మిస్డ్ కాల్స్ చాలా కనిపించాయి. ఇక ఇంటికి వెళ్లాక సత్యం చేతిలో తనకు ఉన్న దే అనుకుంది.

ఓ రెండు గంటలు పోయాక స్వప్న ఇంటికి వచ్చి, "నేనంటే మీకు నిజంగా ఇంత ప్రేమ ఉందా? అంత ప్రొద్దుటే నా కోసం డ్రైవర్ నెంబర్ తెలుసుకుని ఫోన్ చేశారా? దేవుడిని ప్రార్థించి నా క్షేమం గురించి ఆలోచించారా? మీరెప్పుడూ నా చెడు కోరుకుంటారేమో అనుకున్నా, కానీ నిజంగా నేను చాలా అదృష్టవంతురాలిని" అంది చాలా సంతోషంగా - పాత కోపాలన్నీ మర్చిపోతూ.

నిజానికి ఆమెతో పోట్లాట వేసుకోవాలని కాచుకుని ఉన్న సత్యం తన మాటల్ని ఆవిడ అలా అ(పా)ర్థం చేసుకున్నందుకు సంతోషించాడు. ఇప్పుడు పోట్లాడాలి అనుకుంటున్నాడు కానీ, నిజంగా ఏక్సిడెంట్ జరిగి స్వప్నకి ఏమైనా జరిగి ఉంటే తన పరిస్థితి ఎలా ఉండేది? అనే ఆలోచన వచ్చి బుర్ర వేడెక్కుతుంటే ఆ ఆలోచన భరించలేక, వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా, "నువ్వు ఎప్పుడు నన్ను సరిగ్గా అర్థం చేసుకున్నావు గనక, ఇంత కాలానికి కొంచెం అర్థం చేసుకున్నావు" అన్నాడు గోముగా.

స్వప్న సిగ్గు పడిపోయింది. ఆ విధంగా ఆమె చేసుకున్న అపార్థం వాళ్ళిద్దరి మధ్య కొంతకాలం ప్రేమపూలు పూయించింది.

-::అయిపోయింది::-

# తెలుగు వారమండీ

ప్రొ. మలయవాసిని

'తెలుగు జ్యోతి' సంపాదకులు మా పత్రికలో 'తెలుగు వారమండీ' అనే ఒక కొత్త తరహా శీర్షిక నిర్వహిస్తున్నాము, మీరు కూడా ఏదైనా వ్రాస్తే బాగుంటుంది అని అడిగారు. శీర్షిక ఆకర్షణీయంగా ఉంది. ఏమి వ్రాయాలీ ఎలా వ్రాయాలీ అని ఆలోచిస్తూఉంటే, పెళ్ళివారమండి! ఆడ పెళ్ళివారమండి! అంటూ చిన్నప్పుడు అట్లతద్ది రోజుల్లో వెన్నెట్లో పాడుకుంటూ ఆడుకున్న ఆట గుర్తుకి వచ్చింది.

ఆ ఆటలో ఆడ పిల్లలందఱూ రెండు జట్లుగా ఏర్పడ్డారు. ఒక జట్టు మొగ పెళ్ళి వారు, ఒక జట్టు ఆడ పెళ్ళివారు. పెళ్ళికి సంబంధించిన విషయాలన్నీ పాట రూపంలో అడగడం, సమాధానం రాబట్టుకోవడం ఉంటుంది. ఆడ పెళ్ళి వారిని మగ పెళ్ళివారు - పెళ్ళి కూతురు వయస్సు, అన్నదమ్ములు, చదువు, నగలు, ఆస్తి మొదలైన వివరాలన్నీ అడుగుతారు. అన్నీ చెప్పాక మగపెళ్ళివారికి ఇవన్నీ నచ్చుబాటైతే, కట్నకానుకలు అడుగుతారు. అవన్నీ నచ్చితే సంబంధం ఖాయం చేస్తారు.

చిన్నీ చిన్నీ కేంనగలూ

సిరిగలగౌరికి ఏంనగలూ

తామరసిరిమొగ్గా! - అంటూ ప్రశ్నలరూపంతో నడుస్తుంది.

అట్లతద్ది అష్టాదశ వర్ణాలకూ పండుగే! అంటారు. అట్ల తద్దికి పదిహేను రోజుల ముందు నుండీ ఈ ఆటలు రాత్రి పూట వెన్నెట్లో ఆడుకుంటారు. విసుగు లేకుండా.

పెళ్ళివారమండీ, ఆడ పెళ్ళివారమండీ!

పెళ్ళివారమండీ, మగ పెళ్ళివారమండీ!

అనే ఈ మాటలు అరవై ఏళ్ళ క్రితం విన్నవి గుర్తుకొచ్చాయి. ఈ నాటి ఈ శీర్షిక వినడంతోనే. ఈ మాటల జాడల్లోనుండి నేటి ఈ శీర్షిక సంపాదకుల మనస్సు నుండి పుట్టుకొచ్చి ఉంటుంది.

'స్వస్థాన వేష భాషలు ' అనే మాట వింటూ ఉంటాం. ఏ ప్రాంతీయులకు ఆ ప్రాంతీయమైన వేషం, భాషా, వ్యవహారం ఉంటాయి. వాటికి ఒక ప్రత్యేకత కూడా తప్పకుండా ఉంటుంది. అదే ఒక జాతికి సంబంధించి కూడా. తెలుగు వారమండి! అన్నప్పుడు ఆ రెండు విషయాల్లో తెలుగు వారి ప్రత్యేకత గుఱించి నాలుగు విషయాలు ముచ్చటించుకోవడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ చిన్న వ్యాసం.

'బాల వాఙ్మయ బ్రహ్మ' చింతా దీక్షితులు గారు తెలుగింటి ఆడ పిల్లల కోసం 'లక్క పిడతలు' అనే పేరుతో చక్కని చిట్టి చిట్టి పాటలు కూర్చి బొమ్మలు చేర్చి ముద్రించారు. నా చిన్నప్పుడు నాకు అ - ఆ లు వ్రాయడం రాక ముందే మా అమ్మ గారు ఇందులో పాటలన్నీ చదివి వినిపించే వారు. ఇప్పటికీ ఆ పాటలు నా జ్ఞాపకాల పొరల్లో నిలిచి ఉన్నాయి. ' వరహాల తల్లి' అనే గేయంతో

'దోస గింజా బొట్టు పెట్టుకున్నావా?

కళ్ళకు కాటుకా దిద్దుకున్నావా?

ముత్యాల జూకాలు పెట్టుకున్నావా?

జడగంటలతో జడ వేసుకున్నావా?

కాళ్ళకూ పారాణి పెట్టుకున్నావా?

పట్టు పరికిణీ నీవు కట్టుకున్నావా?

వచ్చి ముద్దియ్యవే వరహాల తల్లీ!

ఇది ఒక నాటి తెలుగింటి ఆడ పిల్లల వేషం. ఈ వేషం చూడ గానే 'తెలుగు బాలిక ' అని ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈ సందర్భంలో ఒక చిన్న అనుభవం చెప్పాలి. 1989 లో మేము జైపూర్ (రాజస్థాన్) వెళ్ళాం. అప్పుడు మా అమ్మాయి వయస్సు పది సంవత్సరాలు. సరిగ్గా దీక్షితులు గారు అడిగినట్లుగా పట్టు పరికిణీ కట్టుకుని జూకాలూ జడ గంటలూ పెట్టుకుని ఉంది. బిర్లా వారి లక్ష్మీనారాయణ దేవాలయంలో మమ్మల్ని చూసిన అక్కడ చదువుకుంటున్న తెలుగు విద్యార్థులు దగ్గఱకు వచ్చి మీరు తెలుగు వారా అని అడిగారు. అవును ఎలా తెలిసింది అంటే - పాప వేషం చూసి అనుకున్నామండీ అన్నారు. తెలుగువారుగా గుర్తించబడే వేషమన్న మాట అనుకున్నాం. వేషం జాతిని గుర్తింప జేసేదిగా ఉండాలన్న మాట.

తెలుగు వారమండీ! అనేది - పెళ్ళి వారమండీ! అనే నాదం నుండి వచ్చింది కదా! పెళ్ళి అత్త వారిల్లు - తెలుగు వారు చాలా చిన్న వయస్సు నుండీ పరిచయం చేస్తారు. తెలుగు వారికి అత్త వారిల్లంటే చాలా ఇష్టం అనిపిస్తుంది. ఎందుకంటే - మఱీ చిన్న పిల్లల్ని ఆడించే సందర్భంలో కూడా అత్తవారింటి ప్రస్తావన తెస్తారు. బహుశా ఈ రోజుల్లో ఈ

దృశ్యం కనబడక పోవచ్చు. కానీ ఒకప్పటి మధుర దృశ్యమిది. చిన్న పిల్లల్ని ఆడించేటప్పుడు - ఎదురుగా కూర్చోపెట్టుకుని - అర చేయి పట్టుకుని ఇల్లలికి, ముగ్గేసి, పీటేసి, ఆకేసి, పప్పేసి, అన్నం పెట్టి పప్పన్నం కలిపి, గుండ్రంగా చేసి, గుంట చేసి, గుంటనిండుగా నెయ్యి పోస్తే, ఆ నెయ్యి పొంగి పొరిలి కారుతూ - అత్తారింటికి దారేదీ? అంటూ మోచేతి వారి సందు గుండా చంకలో వారింటికి వెళ్ళింది - అత్తారిల్లు వచ్చేసింది అని కితకితలు పెడితే పిల్లలు పక పకా నవ్వుతూ ఆనంద పడిపోతారు. ఆ నవ్వు కితకితల వల్లా, అత్తారింటికి వెళ్ళడం వల్లా? తెలుగు వారే చెప్పాలి మఱి. అత్తారింటిని పసిపిల్లలకు పరిచయం చేయడంలో ఆంతర్య ఏమై ఉంటుందో?

తెలుగు వారి భాషా వ్యవహారపు తీరు తెన్నుల్లో అందాలు మఱికొన్నిటిని చూద్దాం.

సరే ఉంటామండీ - అంటే అలాగే మీరు చెప్పినట్లే ఉంటామండీ అనే అర్థం కాదండి. మేము వెళ్తున్నామని. చిత్రంగా ఉంది కదా!

లేవండి! అంటే కూర్చున్న వాళ్ళని లేచి నిలబడమని కాదు. భోజనాలకు సిద్ధం కండి అని.

మంచి మాట చేసి వెళ్ళండి: - మంచి మాట చేయడం ఏమిటి? మాటలు ఎవరైనా చేస్తారా? తెలుగు వారు మాటలే కాదు, మంచి మాటలు కూడా చేస్తారు. మంచి మాట చేయడమంటే భోజనం చేయడం. తెలుగు వారికి - 'మంచి మాట ' ఏమిటంటే భోజనం. బాగుంది కదూ వాడుక.

నోరు మూసుకు తిను:- నోరు మూసుకు తినడం సాధ్యమా, చెప్పండి. తెలుగు వారు తినగలరు. నోరు మూసుకు తినడమంటే - మాట్లాడకుండా మౌనంగా భోజనం చేయమని తాత్పర్యం.

తెలుగు వారి సంభాషణల్లో, సంస్కృతిలో 'తల' కు చాలా ప్రాధాన్యత ఉంది. అందుకే దాన్ని ఎంతగానో గౌరవిస్తారు.

ఎక్కడైనా ఎప్పుడైనా తెలుగువారు 'తలెత్తుకునే' బతకాలీ అని ప్రయత్నిస్తారు. దేనికీ తల వంచకు ధైర్యంగా ఎదుర్కో అనేది తెలుగు వాళ్ళే.

ఐతే కొన్ని సందర్భాలలో తల వంచుకోవడం మర్యాదగా సంభావిస్తారు. తెలుగు నాట ఒకప్పుడు పెళ్ళి కూతురు తల వంచుకుని కూర్చోవడం మర్యాద. ఐతే ఏ సందర్భంలోనూ మగవాళ్ళు తలవంచనే రాదు. వంచితే వెంటనే ఏమిట్రా అలా పెళ్ళికూతుర్లా తల వంచుకుని కూర్చున్నావ్, అంటు మందలిస్తారు.

ఏ పనైనా తెలుగు వారు బుద్ధి కుదిరితే తలతో చేస్తారు. తలక్రిందులుగా తపస్సు చేసైనా, తల తాకట్టు పెట్టైనా తాము సాధించాలనుకున్నది సాధించే వారు తెలుగు వారు.

అసలు 'తలలు మార్చేసే' వారు కూడా అక్కడక్కడా తారస పడ్తూ ఉంటారు. అతి ధైర్య వంతులు, ఏం? వాడేమైనా తలతీసి మొలేస్తాడా, రమ్మను చూద్దాం అంటూ విరుచుకు పడ్తారు.

మఱి కొందఱు మర్యాదస్తులు - ఏదైనా పొరపాటు చేసినా, అన్న మాట నిలబెట్టుకోలేక పోయినా పశ్చాత్తాపంతో - 'ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదు' అనీ, 'తలెత్తుకోలేను' అనీ, 'తల కొట్టేసినట్లైందనీ' బాధ పడేవారు - తెలుగు వారే.

సరిగ్గా ఆలోచించకుండా పనులు చేసిన సందర్భాలలో 'బొత్తిగా తలకాయ లేని పని' చేశాననీ, 'తలా తోకా లేని మాటలు మాట్లాడాననీ', ఒప్పేసుకునేదీ తెలుగు వారే.

సందర్భ శుద్ధి లేని రెండు విషయాలు జోడించి - తలకాయకీ మోకాలికీ ముడి పెట్టే రకాలూ ఉంటారు.

'తల వాచేలా తిట్టే' పెద్దలూ ఉంటారు తెలుగు వారిలో. ప్రతి విషయంలో 'తల నొప్పి' తెప్పించే తల తిక్కల వాళ్ళూ ఉంటారు.

తెలుగు వారు పెద్దల ఆజ్ఞను శిరసావహిస్తారు. పెద్దల యెడ వినయం ప్రదర్శిస్తూ 'తలలో నాలుకలా' వ్యవహరిస్తారు.

ఇలా ఆలోచిస్తూ ఉంటే తవ్వి తలకెత్తుకునేటన్ని లభిస్తాయి.

తెలుగు వారి ఆచారం ఒకటి - కొత్త సంవత్సరం వస్తోంది కనుక గుర్తు చేసి ఈ వ్యాసం ముగిస్తాను.

'ఉగాది ' మనకు నూతన సంవత్సరారంభం. ప్రధానమైన పండుగ. ప్రకృతిని ఆరాధిస్తూ వేప పూవు పచ్చడి ప్రధానంగా స్వీకరించ వలసిన పండుగ. ఐతే తెలుగు వారు - కొత్తగా పెళ్ళైన కూతురిని, అల్లుణ్ణి ఈ పండుగకు ఆహ్వానించరు. ఎందుకంటే ఇది చేదు పండుగ అనీ అల్లుడికి వేప పూవు పచ్చడి పెట్టి మొదటి పండుగ జరపడం మర్యాద కాదనీ.

ఇదండీ మన తెలుగు వారి సంగతి. అల్లుళ్ళతో సహా అందఱికీ

శోభకృతు నామ సంవత్సర శుభాకాంక్షలు అందజేస్తూ,

శెలవు.

## కొంత వెలుగు కొన్ని చినుకులు

సుంకర గోపయ్య

అతను యుద్ధానికేం వెళ్ళలేదు
కొన్ని కలల్ని కన్నాడు
సకల సౌకర్యాలతో ఇల్లు
కట్టాలనుకున్నాడు

బ్యాంకు ఖాతా బరువు గా ఉండాలని
రెండు ఫ్లాట్లు వెనకేయ్యాలని బాగా కోరిక

అతని పిల్లల దగ్గర అతను లేడు
వాళ్ళు ఎదిగే క్షణాల్ని కోల్పోయాడు
కొమ్మకు అంటిపెట్టుకున్న పువ్వుల్లా
వాళ్ళిప్పుడు నాన్న గుండెకు ఆని
కొన్ని కథల్ని వినాలనుకుంటున్నారు
అలా వేలు పట్టుకుని, వీధి వెంట
గర్వంగా నాలుగడుగులు
వేయాలనుకుంటున్నారు

వాళ్ళ కోసం ఆన్లైన్ లో బోలెడు
ఆటవస్తువులు పంపాడు
ఎక్కి నడుపుతున్న బాటరీ కారు
హఠాత్తుగా ఆగినప్పుడు

వెనుక నుండి ముందుకు నెట్టే నాన్న
చేతులు లేని దిగులు
వాళ్ళని కుంగ దీస్తోంది
వీడియో కాల్ లో నాన్న కు ముద్దుపెట్టినా
అది స్క్రీన్ దాటిపోదని తెలిశాక
ఆ పసిపెదవులు రెండు
నెర్రెలిచ్చిన నేలను తలపిస్తున్నాయ్

అన్ని హంగులతో, ఇల్లు కట్టించినా
నాన్న లేని ఇల్లు
చీకటి నిండిన
పురాతన కట్టడంలా ఉంది
ఏ మొక్కా మొలవని బీడులా ఉంది

నాన్నా నాన్నా
నువ్వు నీడలా వెంట ఉంటే చాలు
మా భుజం మీద నీ చెయ్యి ఉంటే చాలు
నీ కంట్లో నుండి ప్రేమ
చినుకులు చినుకులు గా
మా గుండెల్లోకి కురిస్తే చాలు అంటూ
పిల్లలిద్దరూ చేసే ప్రార్థన
చుట్టూ మార్మోగుతుంది

## సమాజం మారుతుంది సమూలంగా...

కొమ్ముల వెంకట సూర్యనారాయణ

సమాజం మారుతుంది సమూలంగా....
అవును! సమాజం మారుతుంది సమూలంగా ఏ దిశగా?
మహనీయుల చిత్రాలు మతపు రంగు గోడలపై దర్శనమిస్తూ..
సంఘసంస్కర్తల విగ్రహాలు కులసంఘ పూదండలతో కొలుస్తూ ..
స్వాతంత్ర్య సమరయోధులను ప్రాంతాల అజెండాతో ఆరాధిస్తూ..
దేవుళ్ళకు కులాల,మతాల పసుపు కుంకుమలు అద్దుతూ..
కళాకారులను కుల పాలాభిషేకంతో ఆరాధించే దిశగా
మూఢనమ్మకాల యజ్ఞంలో మేధావులు సమిధలు అయ్యే దిశగా
దొంగ స్వాములను దైవాంశ సంభూతులుగా కొలుచుకునే దిశగా
కులాంతర వివాహాన్ని ఆచరణలో కుత్తుకలు తెంచే దిశగా
నమ్మి వేసిన మూడు ముళ్ళకు, ప్రియుని మోజులో కాలరాస్తూ ...
దొంగచాటు వేషాలకు అడ్డని కొంగుచాటు బిడ్డను కాటికి పంపే
దిశగా

నైతిక విలువలు నడిబజారులో నగుబాటు అయ్యే దిశగా
వావి వరుసలు మరిచి సురాపాన మత్తులో అసురులు అయ్యే దిశగా
వెన్నెలంటి పాల బుగ్గలను పిండి పిండి చేసి కాళరాత్రి చూపించే
దిశగా
ఆస్థి తక్కెడలో అమ్మానాన్నలను పంపకం దిశగా
వయసు మీరిన అమ్మానాన్నలను శ్మశానం లో విడిచిపెట్టే దిశగా
అయినప్పటికి సాంకేతికతలో మాత్రం దూసుకుపోతున్నాం
అంతరిక్ష దిశగా
ఏమి ప్రయోజనం! విలువల వలువలు విడిచి పయనిస్తున్నాం
అధ:పాతాళ దిశగా
అవును! సమాజం మారుతుంది సమూలంగా..
సమాజం మారుతుంది సమూలంగా తిరోగమన దిశగా.

-౦-

# తెలుగుదనం

డా. వైదేహి శశిధర్

"ఏ దేశ సంస్కృతయినా ఏనాడూ కాదొక స్థిర బిందువు
నైక నదీనదాలు అదృశ్యం గా కలసిన అంతస్సింధువు"

దేవరకొండ బాలాగంగాధర తిలక్ 1965 లో వ్రాసిన "మన సంస్కృతి" అనే కవితలోని చిట్ట చివరి వాక్యాలు ఇవి. 2023 లో కూడా ఈ వాక్యాలు ఎంతో relevant. ఇటువంటి సత్యం తెలుసుకోవడానికి ,అంగీకరించడానికి ఎంతో insight అవసరం.

తెలుగుదనం గురించి తెలుగు జ్యోతి వారు వ్యాసాలు వ్రాయమని పంపించిన flyer చూడగానే నాకు గుర్తుకు వచ్చిన కవితా వాక్యాలు ఇవి. ఇవి దేశ సంస్కృతికే కాదు మన తెలుగు సంస్కృతికి కూడా అన్వయించుకోవచ్చు. అసలు దూరం గా ఆలోచిస్తే మనది అనుకునేది ఏదైనా పూర్తిగా మనది కాదు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి నిజానికి తర తరానికీ మారుతూనే ఉంటుంది. ప్రకృతి కి కూడా ఇది సహజమే కదా ! ఒక నది ఆవిర్భవించిన చోటు నుండి కొండలు లోయలు దాటి అరణ్యాలు చెట్లు పుట్టలను ఎన్నిటినో దాటుకుని మరెన్నిటినో కలుపుకుని రూపాన్ని వేగాన్ని మార్చుకుంటూ సాగించే ప్రయాణం చూస్తే ఇది మనకు ప్రస్ఫుటం గా తెలుస్తుంది. ఏదైనా ఎప్పటికీ స్థిరం గా ఉండదు. మార్పు ఒక్కటే నిజానికి స్థిరమైనది.

తెలుగుదనం అనగానే మనకు భోగి మంటలు,సంక్రాంతి ముగ్గులు, గంగిరెద్దులు,హరిదాసులు, ఉగాది పచ్చడి, పండగ వంటలు ,పట్టుపావడాలు , జరీ పంచెలు ,జడకుచ్చులు గుర్తు రావడం సహజమే. పుస్తకాలలో సినిమాలలో మనకు చూపించే తెలుగుదనం అది. అంతే కాదు మనలో చాలా మందికి చాలావరకు మన బాల్యం లో అనుభవం లో కి వచ్చిన తెలుగుదనం అది. నిజానికి ఆరోజులలో మన లో చాలా మంది చాలా సర్వ సహజం గా నిత్యకృత్యం గా ఎటువంటి ప్రయత్నం లేకుండా సాగించిన జీవన విధానం అది. తెలుగు భాషను,సంస్కృతిని పరిరక్షించడానికో, తెలుగు సంస్కృతిని ఉద్ధరించడానికో ప్రయత్న పూర్వకం గా చేసినది కాదు. అయితే ఈ నాడు మన ఉభయ తెలుగు రాష్ట్రాల పట్టణాలలో ఎంతమంది తమ రోజువారీ జీవితంలో ఈ విధమైన తెలుగుదనాన్ని భాగం గా చేసుకున్నారో సందేహాకరమైన విషయం. దానికి అనేక కార ణాలు ఉండవచ్చు. సంస్కృతి మీద ప్రభావం చూపే మరొక ముఖ్య విషయం- దైనందిన జీవితంలో వత్తిళ్ళు. ముఖ్యం గా ఉద్యోగస్తులైన భార్యా భర్తలు అటు ఉద్యోగాలనీ ఇటు పిల్లలనూ సంసారాన్నీ చక్కదిద్దుకుంటూ సాగించే ప్రయాణం లో కొన్ని సర్దుకోళ్ళు సహజం. ఆ మేరకు వారి జీవన విధానం లో మార్పులు కూడా సహజం. అంతమాత్రాన వారు తెలుగు వారు కాకపోలేదు. వారి తెలుగుదనాన్ని సందేహించవలసిన పని లేదు.

అసలు తెలుగుదనమంటే ఇది మాత్రమే అని ఒక చట్రం లో ఇమిడ్చి చెప్పలేం. ఉభయ తెలుగు రాష్ట్రాల లోనే ప్రతి ప్రదేశానికీ మారే ఆచార వ్యవహారాలు ఆహార విహారాలు తెలుగుదనమే కదా. మన బాల్యం లోని పద్ధతులు ,మన పూర్వీకుల రోజుల లో పాటించిన పద్ధతులు,ఆచార వ్యవహారాలు విభిన్నమైనా రెండూ తెలుగుదనం లో భాగమే. అయితే మన పిల్లల దగ్గర మనం ఆశిస్తున్న తెలుగుదనం మన తల్లిదండ్రులు మన దగ్గర ఆశించిన తెలుగుదనం ఒకటి కాదని మనకు స్పష్టం గా తెలుస్తూనే ఉంది. ఆరోజులతో పోల్చుకుంటే మన తెలుగుదనం,మన తో పోల్చుకుంటే ఇప్పటి పిల్లల తెలుగుదనం ,వాళ్ళతో పోల్చుకుంటే మన ప్రవాసాంధ్రుల పిల్లల తెలుగుతనం లో వస్తున్న మార్పులు చూస్తే క్రమానుగతం గా సంస్కృతిలో కలుగుతున్న పరిణామం కూడా కనబడుతుంది. ఈ పరిణామం కళలు, సాహిత్యం లో మాత్రమే కాదు రోజువారీ జీవన విధానం లో కూడా చూడవచ్చు. మనం ఎంతో గర్వం గా మన తెలుగు వారి ఆస్తి గా,తెలుగుదనానికి గుర్తు గా భావించే కొన్ని తెలుగు వంటలు ఇప్పటి యువతరం ఆహారపుటలవాట్లలో దాదాపు లేకపోవటం మనం చూడవచ్చు. అయితే వారివు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు అయితే వారిని ఆక్షేపించవలసిన అవసరం కూడా లేదు. ప్రపంచం అంతా ఒక గ్లోబల్ విలేజ్ గా అవుతున్నప్పుడు ఇది అనివార్యమే కాదు,సహజం కూడా.

జీవన యానం లో మనం వివిధ ప్రదేశాలు వివిధ పరిస్థితులు వివిధ అనుభవాలు విభిన్న సంస్కృతులు చూడటం జరుగుతుంది. వివిధ సమాజాలలో భాగమై జీవించటం జరుగుతుంది అప్పుడు ఆ సమాజాల మధ్య కాలక్రమంగా అనేక విషయాలలో సాంస్కృతికంగా ఇచ్చి పుచ్చుకోవటాలు జరగ వచ్చు. మన కు తెలిసిన చాలా ప్రసిద్ధమైన తెలుగు సామెత ఉండనే ఉంది -ఆరు నెలలు

సావాసం చేస్తే వారు వీరవుతారని. అందులో హాస్యం తో పాటు చక్కని సత్యం , మార్పుని సహజమైన పరిణామం గా అంగీకరించే ఒక విశాల దృక్పథం కూడా ఉంది. ముఖ్యం గా ప్రవాసాంధ్రులు దేశం లో నైనా ,విదేశాలలో అయినా అవసరానికో ,అనివార్యం గానో, ఆనందం గానో ఆహార్యం ,అలవాట్లు ,ఆహార విహారాలలో తాము నివసించే సమాజానికి అనుగుణం గా కొంత మార్పు తెచ్చుకోవటం జరుగుతుంది. అంతమాత్రాన వారి తెలుగుదనాన్ని విడనాడినట్లు ఏమాత్రం కాదు.

ప్రవాసాంధ్రుల విషయానికి వస్తే కొంతమందికి తెలుగుదనం సహజమైన ఆనందమైన జీవన విధానమవ వచ్చు , మరికొందరికి ఇష్టం గా అప్పుడప్పుడూ ధరించే ఆభరణం అవ్వవచ్చు. కొందరికి ఇష్టంగానో ఒక్కోసారి కష్టంగానో తప్పనిసరిగా మోసే బాధ్యత అవ్వవచ్చు. ప్రతి ఒక్కరి అనుభవం విభిన్నమవవచ్చు. అంత మాత్రాన ఎవరి తెలుగుదనాన్ని ప్రశ్నించవలసిన అవసరం లేదు.

ప్రవాసాంధ్రుల పిల్లలకు సంగీతం,నాట్యం,తెలుగు భాష నేర్పించడం లో ఎంత మంది పోటీ తో, peer pressure తో నేర్పుతున్నారు /నేర్చుకుంటున్నారు లేదా ఎంతమంది భాష మీద సంస్కృతి మీద మక్కువతో నేర్చుకుంటున్నారు అన్నది చెప్పలేం. ఏది ఏమయినా మన సంస్కృతి పిల్లలకు అనుభవం లోకి రావడానికి సంగీతం,నాట్యం ,భాష మంచి మాధ్యమాలు. కాబట్టి ఇది ప్రోత్సహించవలసిన విషయం. అలాగే ఒకేసారి వివిధ భాషలు నేర్చుకోవడం పిల్లలకు కేవలం ఆత్మవిశ్వాసాన్ని మాత్రమే కాదు జ్ఞాపకశక్తి ని, ఏకాగ్రతను కూడా పెంచుతుంది

ప్రవాసం లో పెరిగే యువతరం ఇంట్లో చూసే ప్రపంచం వేరు బయట మసలే ప్రపంచం వేరు. మన లో చాలా మంది మన పిల్లలు బయట సమాజం లో అలవోకగా కలిసిపోవాలని ప్రొఫెషనల్ గా పైకి రావాలని, అమెరికన్ లా ఇంగ్లీష్ మాట్లాడాలని,కంపెనీలకు సీ యి వో లు,డాక్టర్లు ,ఇంజనీర్లు అవాలని కానీ ఇంట్లో మాత్రం పూజలు చేసి, మనం చెప్పిన వారినే పెళ్ళిళ్ళు చేసుకోవాలని కోరుకుంటారు. నిజానికి వారికి అది ఇబ్బంది కలగకపోతే వారికి పూర్తిగా అంగీకారమయితే అందులో తప్పు కూడా లేదు. కానీ మనం సహానుభూతి తో ఆలోచిస్తే చాలామంది పిల్లలపై అది ఒత్తిడి ని కలుగ జేస్తుంది. సహజంగా నే వారికి వారు పెరిగిన వాతావరణం లోనే సౌలభ్యం ఉంటుంది,వారు పైకి చెప్పకపోయినా.అంత మాత్రాన వారి మూలాలపై వారికి గౌరవం లేదని కాదు. కాకపోతే తెలుగుదనం తెలుగు సంస్కృతి పైన వారికి ఉన్న అవగాహనని ,వారి తెలుగు తనపు మూలాలపై వారికి ఉన్న సెంటిమెంట్ ను, మన దృష్టిలో ఉన్న "తెలుగు సంస్కృతి" తూకపు రాళ్ళ తో తూచకూడదని నా ఉద్దేశ్యం.

తెలుగు రాష్ట్రాలలో కూడా తెలుగుదనం కాలం తో పాటు అనేక మార్పులు చేర్పులు చెంది ఇతర సంస్కృతులలోంచి కొన్ని సంప్రదాయాలని తనలో కలుపుకోవడం నిత్యజీవితం లో చూస్తూనే ఉన్నాం. ఉదాహరణకు తెలుగు హిందూ వివాహాలలో ఇమిడిపోయిన మెహందీ సంగీత్ వంటి వేడుకలు. అవి తెలుగువి కాకపోయినా మనం అంగీకరించినప్పుడు ఇదే తెలుగుదనం అని మనం ఎక్కడ గీత గీయగలం ?

మనకున్న మరొక గొప్ప సంపద మన అందమైన ఉన్నతమైన సాహిత్యం. తెలుగు వారు గర్వించ దగ్గ సాహిత్యం మన సొత్తు. దీన్ని ముందు తరాలకు అందించడం మాత్రం కేవలం అనువాదం ద్వారానే సాధ్యం అని నా ఉద్దేశ్యం. ముందు తరాలకు మన సంస్కృతి మీద అవగాహన,గౌరవం, అనుబంధం పెంచే గొప్ప మాధ్యమం సాహిత్యం.

నా వరకు నాకు తెలుగుదనమంటే - తెలుగు వారి సొత్తయిన గొప్ప సాహిత్యాన్ని ,సంగీతాన్ని, నాట్యాన్ని ఆస్వాదించటం , నాకు తెలిసిన తెలుగు సంస్కృతి తో ముడివడ్డ నా బాల్యంలోని అందమైన జ్ఞాపకాలని తలచుకుని ఆనంద పడటం,గర్వపడటం, ఆర్ద్ర మవ్వటం. నా ఉద్దేశ్యం లో మతం లాగానే జీవన విధానం కూడా వ్యక్తిగతమైనది. తెలుగుదనం లేదా సంస్కృతి లో వచ్చే మార్పులను ఎంతవరకు పాటించాలి లేదా తమకు తెలిసిన పూర్వ సంస్కృతినే పాటించాలా అనేది కూడా పూర్తిగా వ్యక్తిగతమే. ఎటొచ్చీ ఒకరి జీవన విధానం వారి ఆహార విహారాలు ఆహార్యం బట్టి వారి తెలుగుదనాన్ని,వారికి తెలుగుదనం పట్ల ఉన్న మక్కువను కానీ అంచనా వెయ్యలేం. అంతే కాదు నిరంతర కాల ప్రవాహం లో ఎంత ఉన్నత చరిత్ర ఉన్న సంస్కృతిలో వచ్చే మార్పుని అయినా ఆపటం అసాధ్యం. కాలానికి అనుగుణం గా మనం మారుతూ ప్రాచీన అధునాతన సంస్కృతులలోని ఆణిముత్యాలని ముందు తరాల వారికి అందించే ప్రయత్నం మాత్రం చేయటానికి

మనం ఆలోచించడం అవసరం.

# కుసుమ

శింగరాజు శ్రీనివాసరావు

నిన్నటి దాక తమ కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్న సుబ్బాయమ్మ హఠాత్తుగా కన్నుమూయడంతో ఒక్కసారిగా ఆ కుటుంబం రోడ్డున పడినట్లయింది. ఎంతో కష్టపడి కుసుమను చదివించింది ఆమె. ఆమెకు వచ్చే పెన్షను లోనే పొదుపు చేసుకుంటూ కుసుమను ఇంజనీరింగ్ చదివించింది. హైదరాబాదులో ఉద్యోగప్రయత్నాలలో ఉన్న కుసుమకు బామ్మ మరణం ఒక అశనిపాతంలా తగిలింది. అమాయకత్వం తప్ప పైసా సంపాదించను చేతకాని నాన్న ముకుందం, తద్దినాలకు భోక్తగా వెళ్ళి తెచ్చి ఇచ్చే వందో, రెండు వందలో ఇప్పుడు వారికి ఆధారంగా మారాయి. దానికి తోడు మాటలు రాని తమ్ముడు వారికి మరొక పెద్ద బాధ్యత. ఈ మధ్యనే ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షను వారికి ఇంకొంత ఆసరాగ మారింది. పెద్దలు సంపాదించి పెట్టిన ఆస్తులేవీ లేకపోవడంతో, తాత బ్రతికున్నపుడు ఏర్పరచిన ఇరవై గదుల స్థలమే ఇప్పుడు వారికి మిగిలిన ఆధరువు.  బామ్మ మరణం కుసుమను కలచివేసింది. ఈ ఇంటికి తనే ఇక ఆధారమన్న విషయం ఆమెకు పూర్తిగా అర్థమయింది. హైదరాబాదులో ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేయాలన్న ఆశను అటకెక్కించి, తను చదువుకున్న ప్రైవేటు పాఠశాలలోనే టీచరుగా చేరింది. ఏది ఆగినా కదిలే కాలం ఆగదన్నట్లు ఆమె వయసు పాతికలోకి పడిపోయింది. ఎవరి లోపాలు వారికున్నా ఎదుటివారి లోపాలతో పాచికలాడుకునే మనస్తత్వాలు మనచుట్టూ లక్షలలో ఉన్నాయి కదా. ఆ లక్ష కాకుల కేకలను ఎంత అలక్ష్యం చేద్దామనుకున్నా, ఏవో కొన్ని స్వరాలు భీకరనాదాలై మన గుండెలను పిండకమానవు. కుసుమ విషయంలోను అదే జరిగింది. చుట్టుపక్కల వారి మాటలకు స్పందించిన తల్లి శకుంతల కుసుమను పెళ్ళి చేసుకోమని పేధిస్తూనే ఉన్నది. కుసుమ ఆ విషయాన్ని దాటవేస్తూనే ఉన్నది.

******

మనిషికి ఎక్కడా దొరకని ప్రశాంతం దైవ మందిరం వద్ద దొరుకుతుందని పెద్దల నానుడి. అది నిజం కూడ. 'నేను అశక్తుడిని భగవంతుడా..నీవే దిక్కు' అని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే ఆ దేవుడు కరుణించి దారి చూపుతాడన్నది కాదనలేని నిజం. అందుకే వచ్చింది కుసుమ దేవాలయానికి. తాను తెచ్చిన పూలమాలను పూజారి చేతికి ఇస్తూ ఉలిక్కిపడింది పూజారిని చూసి. అతను ఆమె క్లాస్ మేట్ రాజేష్. ఇంటరు వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. రాజేష్ వాళ్ళ నాన్నగారు కుసుమ తాతయ్య కృష్ణయ్యకు శిష్యుడు. రాజేష్ అప్పుడప్పుడూ కుసుమతో కాలేజిలో మాట్లాడుతుండేవాడు. చదువులో కొంచెం వెనుకబడి ఉండేవాడు. ఇంటరు తప్పడంతో అతను వాళ్ల ఊరికి వెళ్ళిపోయాడు. తరువాత అతడిని ఇదే ఆమె చూడడం. అతను చిరునవ్వు నవ్వి ఆమె ఇచ్చిన పూలను తీసుకుంటూ "బాగున్నావా సుమా" అని అడిగాడు.

"బాగున్నాను. నువ్వు ఇక్కడ.." ఆగిపోయింది కుసుమ.

"బయట మండపంలో కూర్చుని ఉండు. ఇంకో పది నిముషాలలో మా పెదనాన్న వస్తాడు. ఆయన రాగానే నేను వచ్చి నీకు అన్నీ వివరంగా చెబుతాను" అని చెప్పి ఆమె ఇచ్చిన పూలమాలను దేవుడి మెడలో వేసి, తీర్థం ఇచ్చాడు. ఆమె తలవూపి బయటకు వచ్చేసింది. ఒకసారి రాజేష్ ఇంటికి వచ్చి వెళ్లిన తరువాత, తనకు బామ్మకు మధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది కుసుమకు. ఇది జరిగి సుమారు పది సంవత్సరాలు కావస్తున్నది.

*****

"ఒసేయ్ సుమా..వీడు నీ క్లాసే కదూ"

"అవును బామ్మా.. ఏంది బామ్మా నువ్వు. కుసుమ అని పేరు పెట్టి మళ్ళీ సుమ అని పిలుస్తావు. నీ వల్ల అందరూ నన్ను సుమ అనే పిలుస్తున్నారు"

"పేరులో ఏముందిలేవే. సుమ అని పిలిస్తేనన్నా, నువ్వు ఆ టి.వి లో సుమలా గలగలా మాట్లాడి అందరినీ మెప్పిస్తావనిఆశలేవే మొద్దూ. అది సరేగానీ..వీడు తెలివిగలవాడేనా, "వీళ్ళ నాన్నలా మొద్దా"

"అంత పెద్ద తెలివిగలవాడేం కాదు బామ్మా. మొన్న మొదటి సంవత్సరంలో రెండు సబ్జెక్టులు ఫెయిలయ్యాడు. అయినా వాళ్ళతో మనకెందుకు"

"అదికాదే..వాడు కాస్త తెలివిగల వాడయితే ఒక

రాయి వేసి చూద్దామని"

"దేనికి"

"నీ పెళ్ళికి. వాళ్ళూ మనవాళ్ళే కదే. మంచి కుటుంబం. వాళ్ళ నాన్న ప్లీడరు గుమాస్తాగా బాగానే సంపాదించాడు. పైగా తాతయ్యంటే వల్లమాలిన అభిమానం. మనం నోరు తెరిచి అడిగితే కాదనరు. ఎటొచ్చీ మనమే నిర్ణయం తీసుకోవాలి"

"బామ్మా..నీకు నోరు తెరిస్తే నా పెళ్ళిగోల తప్ప వేరే ఏదీ లేదా. నేను బాగా చదువుకోవాలి. ఇంజనీరింగు పూర్తయ్యే వరకు ఆ మాటే ఎత్తవద్దు"

"అబ్బ..ఇప్పుడు నిన్ను ఉన్నపళంగా పెళ్ళిపీటలు ఎక్కమనికాదే. ఒక ఆలోచన అంతే. అది కూడ వాడిలా ఢంకీలు కొడుతూ ఉంటే కాదు. బాగా చదువుకుని పైకి వస్తేనే. నేనెంతకాలం బ్రతుకుతానో నాకే తెలియదు కదే. నేను పోయేలోపుగ నీ జీవితానికి ఒక దారి చూపిస్తే, ఆ తరువాత నువ్వే ఈ సంసారనావను నడిపిస్తావు"

"ఇదో..ఈ పిచ్చిమాటలే వద్దు బామ్మా. నువ్వెక్కడికీ పోవు. నేను పోనివ్వను. నా చదువు పూర్తికావాలి. ఉద్యోగం రావాలి. పెళ్ళి కావాలి. పిల్లలు పుట్టాలి. వాళ్ళను నువ్వు ఆడించాలి. అప్పటిదాకా నువ్వు పోతానన్నా, నేను నిన్ను పంపించను" అని బామ్మ గుండు పట్టుకుని ఊపింది కుసుమ.

"నా తల ఊడిపోతుంది ఆపవే తల్లీ..అలాగే..అలాగే..పాపీ చిరాయువని నేనెక్కడికి పోతాను. నీ రసం పిండకుండా పోతానా" అని గలగల నవ్వి కుసుమ బుగ్గమీద ముద్దుపెట్టింది రాజమ్మ.

******

ఆ సంఘటన గుర్తుకు రాగానే కళ్ళు తడిదేరాయి కుసుమకు. తనే లోకంగా బ్రతికిన బామ్మ ఇప్పుడు ఇక లేదు అన్న భావన ఆమె మనసును దుఃఖసాగరంలో ముంచుతున్నది. ఇంతలో అక్కడికి వచ్చాడు రాజేష్.

"ఆలస్యం చేశానా సుమా" వస్తూనే పలకరించాడు రాజేష్.

"అబ్బే..అదేంలేదు రాజేష్" అంటూ లేవబోయింది కుసుమ.

"వద్దు..వద్దు..కూర్చో. నేను ఇక్కడే కూర్చుంటాను" అని అక్కడే కూర్చుని మాట్లాడసాగాడు రాజేష్.

"ఎలా ఉన్నారు సుమా"

"బాగానే ఉన్నాం. ఇంతకూ నువ్విక్కడికి..."

"ఈ గుడి పూజారి మా పెదనాన్నే. మేము ఈ ఊరినుంచి వెళ్ళే ముందే ఇక్కడ చేరాడు. అందుకే మీకు ఎవరికీ ఆయన మా బంధువని తెలియదు. ఆయన వేరే పనిమీద అర్జంటుగా ఊరు వెళ్ళాలని నన్ను ఓ రెండు రోజుల పాటు వచ్చి గుడి చూసుకోమన్నాడు. అందుకే వచ్చాను. అవును బామ్మ గారు కాలం చేశారటగా"

"అవును. చనిపోయి నాలుగేళ్లు కావస్తున్నది. ఆమె లేకపోవడం మా కుటుంబానికి తీరని లోటు"

"వారం క్రితమే నాకు తెలిసింది. మీ మామయ్య మొన్న నాన్నగారికి కనిపించినపుడు చెప్పారట. మీరు చాలా ఇబ్బందులలో ఉన్నారని, నువ్వేదో చిన్న స్కూలులో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నావని చెప్పాడు. నాన్న చాలా బాధపడ్డారు. నన్ను వెళ్ళి చూసి రమ్మన్నాడు. ఎలాగూ వస్తున్నా కదా అని మొన్న రాలేదు. రేపు ఇంటికి వచ్చి విచారిద్దామనుకున్నాను. ఇంతలో నువ్వే కనిపించావు. అమ్మ, నాన్న, తమ్ముడు ఎలా వున్నారు? వాడికి మాటలు వచ్చాయా?" కుశల ప్రశ్నలు వేశాడు రాజేష్.

"మా జీవితంలో ఎలాంటి మార్పు లేదు. బామ్మ చనిపోయిన తరువాత పెన్షను ఆగిపోయింది. బామ్మ అకౌంటులో ఉన్న లక్షలో యాభై వేలు ఆమె కర్మ ఖర్చులకు సరిపోయాయి. నాకు వేరే దారి కనపడక మాకు దగ్గరలో ఉన్న స్కూలులో టీచరుగా చేరాను. నెలకు ఓ ఆరువేలు ఇస్తున్నారు. ఏదో బొటాబొటిగా సరిపోతున్నాయి. ఇక అన్నీ మామూలే. అవును..నువ్వు ఇంజనీరింగు చేయలేదా?"

"లేదు..నేను ఇంటరు తప్పేసరికి నాన్న చాలా బాధపడ్డారు. ఇక నా చదువు మీద ఖర్చు పెట్టడం వృథా అని చెప్పి మా సొంత ఊరికి తీసుకెళ్ళారు. అక్కడ మా తాతయ్య రాముల వారి గుడిలో పూజారి. నన్ను ఆయన దగ్గర దించి నాన్న గారు ఒంగోలులో వేరే లాయరు దగ్గర చేరారు. ఈ విషయం బామ్మకు తెలుసు. నీకు చెప్పలేదా"

"ఏమో నాతో ఎప్పుడూ అనలేదు. నువ్వు బాగ చదువుతావా అని అడిగింది. పాపం ఇంటరు తప్పాడని చెప్పాను. అదికూడ మీరు ఇక్కడ ఉన్నప్పుడే. అంతకంటే

నాకు ఏమీ చెప్పలేదు. అయితే నువ్వు చదువు ఆపేశావా?"

"ఏదో కష్టపడి ఇంటరు పూర్తి చేశాను. తాతయ్య దగ్గర కొద్దిగా జాతకాలు చూడడం, హోమాలు అవీ చేయడం నేర్చుకున్నాను. తాతయ్య వెంట తిరుగుతూ పెళ్ళిళ్ళవీ చేస్తూ కాలం గడుపుతున్నాను. మరి నువ్విక ఉద్యోగ ప్రయత్నాలు చేయవా?"

"ఉద్యోగం కోసం ఊరుదాటి వెళ్ళే పరిస్థితి కాదు నాదిప్పుడు. కుటుంబ భారమంతా నామీదే పడింది. నాన్నగారి సంపాదన నీకు తెలియనిది కాదు. అందుకే వేరే ఉద్యోగం చేసే ఆలోచన లేదు. ఇక్కడే ఇలాంటి ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కాలం వెళ్ళదీయాలి"

"నిజమే..వేరే చోటికి వెళితే మీ నాన్నకు వచ్చే ఈ నాలుగు రూకలు కూడ రావు. ఇక్కడ మీది సొంత ఇల్లు. తిన్నా, తినకున్నా తలదాచుకోను వీలున్నది. అదే వేరే ఊరయితే సగం జీతం అద్దెలకే సరిపోతుంది. నీ నిర్ణయం మంచిదే కానీ సుమా, ఇలా ఎంతకాలమని. పోనీ నువ్వే ఏదైనా సొంతంగా ప్రయత్నించ కూడదా"

"నేనా..ఏం చెయ్యగలను. ఆడపిల్లను ఏం వ్యాపారం చేయగలను. పైగా దేనికైనా డబ్బు కావాలి. అసలు నాకు అలాంటి ఆలోచనలు లేవు. నా సంగతి సరే, నువ్వు ఇక పూజారిగానే మిగిలిపోతావా"

"ఏం అందులో తప్పేముంది. నిన్ననే మా పెదనాన్న గారు చెప్పారు. తను వచ్చే సంవత్సరం ఆలయ పూజారి వృత్తి మానేసి, విశాఖపట్టణం లోని మా అక్క దగ్గరికి వెళ్ళిపోతాడట. ఇది ఎండోమెంటు వారి అధీనంలోని గుడి కనుక, నన్ను ఇక్కడ చేరుస్తాడట. అప్పుడు నాకు నెలకు పదివేల వరకు జీతం వస్తుంది. నీకు తెలియదేమో సుమా..ఈ రోజులలో జనాలకు భక్తి పెరిగి పూజలు, వ్రతాలు అని మాకు బాగా గిరాకీ పెంచారు. ఒకప్పుడు పూజారి అంటే దేవుడి ప్రసాదం తిని బ్రతికేవాడు, కుచేలుడికి తమ్ముడు అనుకునేవారు. ఇప్పుడు మా దశ తిరిగింది. వద్దంటే డబ్బు వచ్చిపడుతున్నది. ఇది జోక్ కాదు నిజం"

"అంటే రొట్టె విరిగి నేతిలో పడబోతున్నదన్నమాట" అని పకపకా నవ్వింది సుమ.

"సుమా..నేనొక సలహా చెబుతాను. వీలుంటే చూడు" అన్నాడు రాజేష్.

"చెప్పు. ఏమిటది. కొంపదీసి నాకు కూడ మంత్రాలు నేర్పి, నన్ను నీకు అసిస్టెంటుగా పెట్టుకుంటావా" నవ్వుతూనే ఉంది సుమ.

"అదో..ఆ ఆటకాయితనమే వద్దు" అని మూతి ముడుచుకున్నాడు రాజేష్.

'బామ్మ చనిపోయిన తరువాత మనసుతీరా నవ్వింది ఇప్పుడే కదా' అనుకుంటూ "సారీ రాజేష్..నవ్వనులే చెప్పు. నన్ను ఏంచెయ్యమంటావు?" అన్నది సుమ.

"మీ ఇంటి వద్దే ఒక కర్రీ పాయింటు పెట్టకూడదా. ఆంటీ వంట బాగ చేస్తుందని అంటావు కదా. దానికైతే పెద్ద పెట్టుబడి అక్కరలేదు. ముందు తక్కువ మోతాదులో చేస్తూ, తరువాత డిమాండును బట్టి పెంచుకోవచ్చు. అలాగే ఏవైనా పిండివంటలు చేసి షాపులకు వేయవచ్చు కదా. అది నామోషీ అనుకోకు. మనమేమి తప్పు చేయడం లేదుకదా. పెట్టుబడి కావాలంటే నేను ఇస్తాను. తరువాత తిరిగి ఇద్దువు గాని. ఇప్పట్లో ఇది కూడ పెద్ద పెట్టుబడి లేని మంచి వ్యాపారం. పనిలో ఇంట్లో అందరూ భాగం పంచుకోవచ్చు. నువ్వు ఒక్కదానివే కష్టపడే పని తప్పుతుంది. నువ్వు ఉద్యోగానికి వెళ్ళినా, మీ ఇంట్లో వాళ్ళు ఈ కర్రీపాయింటు నడపవచ్చు. ఏమంటావు" తను అనుకున్నది చెప్పి సుమ వైపు చూశాడు ఏమంటుందోనని.

సుమ ఏమీ మాట్లాడలేదు. రాజేష్ చెప్పినది బాగానే ఉంది. కానీ అమ్మ అందుకు ఒప్పుకుంటుందో, లేదో...

"అమ్మను అడిగి చూస్తాను. ఇంతకూ నువ్వు ఎప్పుడు వస్తావు ఇక్కడికి"

"పెదనాన్న వచ్చే నెలలో వచ్చెయ్యమంటున్నాడు. నాన్నతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాను. మరి నీకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని మీ మామయ్య చెప్పాడు. నిజమేనా"

"అవును. అమ్మ నేను ఎంత చెప్పినా వినడంలేదు. వయసు దాటి పోతుందని తొందరపెడుతున్నది. నాకేమో నేను వెళ్ళిపోతే వీళ్ళ గతేమిటని బెంగ. అమ్మ అర్థం చేసుకోవట్లేదు"

"ఎప్పటికైనా తప్పదు కదా..ముందుగా చేస్తే మీ బామ్మ ఆత్మకు శాంతి కలుగుతుందనేమో..నువ్వెరినైనా ఇష్టపడుతున్నావా"

"నా సంగతి సరే..నీకు కూడ ఏమైనా లవ్ ట్రాక్ ఉందా..నన్ను అలా అడుగుతున్నావు" తలవంచుకున్నాడు రాజేష్.

"పర్వాలేదు చెప్పు" రెట్టించింది సుమ.

"అలాంటిదేమీ లేదు. ఒకప్పుడు ఆశపడ్డాను. కానీ ఇప్పుడు ఆ ఆశలేదు. ఆమె బాగా చదువుకున్నది. నేనిప్పుడు తనకు సరితూగను. ఇవన్నీ ఇప్పుడెందుకు గానీ, ముందు నేను చెప్పినది ఆలోచించు. పెళ్ళి అనేది మీకు సంబంధించినది. అందులో నేను జోక్యం చేసుకోకూడదు. కానీ నువ్వు వెళ్ళేలోపే వారికి ఒకదారి చూపించు. ఎందుకంటే రేపు నీ పెళ్ళయిన తరువాత నీ భర్త వాళ్ల బాధ్యత తీసుకోను ఒప్పుకోవచ్చు, ఒప్పుకోకపోవచ్చు. నేను ఎలాగూ ఉండేది ఇకనుంచి ఈ ఊర్లోనే కనుక, అప్పుడప్పుడు వెళ్ళి చూసి వస్తుంటాను. సరే సుమా.. చీకటి పడబోతున్నది. ఇక బయలుదేరు" అని లేచాడు రాజేష్.

"సరే రాజేష్..ఆలోచించి చెబుతాను. వచ్చే నెల నుంచి ఇక్కడే ఉంటావుగా. కలుస్తాను. అప్పుడు మా ఇంటికి తీసుకు వెళతాను" అని తను కూడ బయలుదేరింది కుసుమ.

ఆమె మనసులో రాజేష్ చెప్పిన కర్రీపాయింటు ఆలోచనలతో పాటు, మరో కొత్త ఆలోచన కూడ చోటుచేసుకుంది.

*****

"మా ఇంటి పరిస్థితి మీకు వివరంగా చెప్పాను. నేనే మా కుటుంబానికి ఆధారం. తమ్ముడికి ఏదైనా చేతిపని నేర్పించి, వాడికి ఒక దారి చూపాల్సిన బాధ్యత కూడ నాదే. మీ తల్లిదండ్రులతో పాటు, మా తల్లిదండ్రులను చూడాల్సిన అవసరం కూడ ఉన్నది. అన్నిటికంటే ముఖ్యంగా నేను ఈ ఊరు దాటి బయటకు రాలేను. అది మీకు సమ్మతమేనా.. బాగా ఆలోచించి మీరే నిర్ధారించుకోండి" పొల్లుపోకుండా తన ఇంటి పరిస్థితి మొత్తం వివరించి తరువాత అడిగింది కుసుమ, తనను చూడవచ్చిన అబ్బాయిని.

"మీ అమ్మ, నాన్నలను చూడడానికి మీ తమ్ముడు ఉన్నాడుగా. అది మీ బాధ్యత ఎందుకవుతుంది. కావాలని మీరు నెత్తిన వేసుకుంటున్నారు" అన్నాడతను.

"వాడికి మాటలు రావు. అందుకని నాకు తప్పదు"

"అది మీ వాళ్ల సమస్య. నాదికాదు. పెళ్ళయితే మీకు మా అమ్మ, నాన్నలదే బాధ్యత. మీ వాళ్ళది కాదు"

"నా తమ్ముడే కాదు, నేను కూడ వాళ్ళ కూతురినే. వాడితో పాటు నాకూ సమాన బాధ్యత ఉంది. అది మీరు మర్చిపోతున్నారు"

"పెళ్లయిన తరువాత పుట్టింటి వాళ్ల బాధ్యత తొలగిపోతుంది"

"అని మీరు నిర్ణయించారా"

"అనాదిగా వస్తున్న ఆచారం"

"ఆ ఆచారానికి తలవంచే వాళ్లకే తాళి కట్టండి. నేను మాత్రం నా వాళ్ల బాధ్యతను తీసుకోవడానికి ఒప్పుకున్నవాడితోనే తాళి కట్టించుకుంటాను. లేదా ఇలానే ఉండిపోతాను"

"మీకు అహంకారం ఎక్కువనుకుంటాను"

"అది ఆత్మాభిమానం. ఆడపిల్ల అంటే చెప్పుకింద తేలనుకునే మీలాంటి వారికి భార్యగా నేనుండలేను. సమాజంలో ఇంకా మీలాంటి వారు ఉండడం వల్లనే ఇంకా ఆడపిల్లల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సారీ సర్.." అని విసురుగా వెళ్ళిపోయింది కుసుమ.

******

"ఎందుకే ఇలా తయారయ్యావు. ఇప్పటికే మూడు సంబంధాలు చెడగొట్టుకున్నావు. అసలు నీ మనసులో ఆలోచన ఏమిటే" కుసుమను నిలదీసింది ప్రవర్థిని, స్కూలు నుంచి వచ్చే దారిలో.

"నా తల్లిదండ్రుల బాధ్యత నాదని చెప్పానుగదే. అందుకు ఎవరూ ఒప్పుకోవడం లేదు. అందుకే వద్దంటున్నాను" చెప్పింది కుసుమ.

"ఈరోజులలో అంత విశాల హృదయులు ఎవరే. కన్నవాళ్ళను గాలికి వదిలేసి ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటున్నారు. ఇక అత్త, మామలను ఎవరు నెత్తిన పెట్టుకుంటారు. ఇప్పుడది తప్పుకాదే, సర్వసాధారణం. నా మాటవిని ముందు చేసుకోవే. తరువాత చూడొచ్చు" ప్రవర్థిని సలహా.

"ప్రవర..నిన్నొక్క మాట అడుగుతాను. అది తప్పో, ఒప్పో నువ్వు చెప్పాలి"

"అడుగు..అయినా నేను చెప్పేది నీకు నచ్చాలిగా"
"ఏమీ లేదే. అప్పుడప్పుడూ నాకోసం స్కూలుకు వస్తుంటాడే రాజేష్, అతని మీద నీ అభిప్రాయమేమిటి?"

"ఎవరు..ఆ పూజారి గారా..మనిషికేం గుండులా ఉంటాడు. మాటతీరు బాగానే ఉంటుంది. కొంపదీసి అతణ్ణి చేసుకుంటావా ఏమిటి?"

"ఏం తప్పా"

"తప్పనికాదే..పోయి పోయి పూజారిని.."

"ఏం వాళ్లు మాత్రం మనుషులు కారా..రాజేష్ మంచివాడు. చిన్నతనం నుంచి మాకు, మా కుటుంబానికి పరిచయం ఉన్నవాడు. అదీకాక అతను ఈ ఊరును విడిచి వెళ్ళడు. నేను కూడ ఇక్కడే ఉండి పోవాలని అనుకుంటున్నాను. అందుకని అతనితో జీవితాన్ని పంచుకుంటే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తున్నాను"
"నీ ఆలోచన మంచిదేనే. కానీ ఇంజనీరింగ్ చేశావు కదా. ఎంచక్కా ఎవరైనా సాఫ్ట్ వేర్ ను చేసుకుని ఏ అమెరికాకో చెక్కేసి, అక్కడ ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ జాలీగా ఉండక ఇంకా ఈ ఊరు పట్టుకుని వేలాడతానంటావేమిటే"
"ఆశలు అందరికీ ఉంటాయి ప్రవర, కానీ అవి తీరేది ఎందరికి. నేను కావాలని ఈ పేదరికంలో పుట్టలేదు. భగవంతుడి నిర్ణయమది. అలాగే నన్ను కన్న ఈ పెద్దవారిని, మాటలు రాని నా తమ్ముడిని వదిలి నాదారి నేను చూసుకోవడం ఎంతవరకు న్యాయం. నువ్వే చెప్పు. రేపు నేను ఏ ఇంజనీరునో చేసుకుంటే, అతను నా కుటుంబ బాధ్యత తీసుకుంటాడని నమ్మకమేమిటి. పోనీ నేను ఉద్యోగం చేసి పంపాలన్నా అతను ఒప్పుకోకపోతే. అసలు 'కన్ను పోయెంత కాటుక' ఎందుకన్నట్లు, ఈ ప్రయాసలన్నీ ఎందుకు చెప్పు. రాజేష్ అయితే మా గురించి పూర్తిగా తెలిసిన వాడు, మాలాగ ఒక మధ్యతరగతి కుటుంబీకుడు. అందుకే నా మనసు అతని వైపే మొగ్గుతున్నది"

"సుమా..నాదొక చిన్న సందేహం. రాజేష్ మాత్రం మీ కుటుంబ భారాన్ని నెత్తిన వేసుకుంటాడని గ్యారంటీ ఏమిటి? మరోలా అనుకోకు. కీడెంచి మేలెంచాలి కదా"

"నీ అనుమానం నాకూ వచ్చింది ప్రవరా.. కానీ ఈ ప్రపోజల్ తెచ్చింది రాజేష్ వాళ్ల అమ్మగారు. మా తాతయ్యంటే వాళ్లకు వల్లమాలిన అభిమానం. ఆయన చదువు చెప్పడం వల్లనే ఈరోజు మాకు నాలుగు వేళ్ళు లోపలికి పోతున్నాయని ఆమె అంటుంది. బహుశా ఆ కృతజ్ఞత వల్లనేనేమో, నన్ను పిలిచి ఈ విషయం చెప్పింది. నేను ఆలోచించుకుని చెబుతానని చెప్పాను"

"అతను నీకంటే తక్కువ చదువుకున్నవాడు కదే. అయినా నీకు ఇష్టమేనా"

"మంచి మనసును మించిన చదువు లేదే. అది వాళ్ల కుటుంబంలో టన్నుల కొద్దీ ఉన్నది. ఏమో నాకైతే మనస్ఫూర్తిగా ఇష్టంగానే ఉంది"

"నీ విశాలమైన ఆలోచనలకు, తల్లిదండ్రుల మీద నువ్వు చూపించే బాధ్యతకు, నాకు చాలా సంతోషంగా ఉంది సుమా. ప్రేమగా చూసే భర్త లభించడం కన్నా ఆడపిల్లకు అదృష్టమేమున్నది. అది నీకు లభించింది. అదే నాకు చాలా సంతోషం. ఆల్ ది బెస్ట్ సుమా" అని సుమను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపింది ప్రవర్థిని.

"థాంక్స్ ప్రవరా..నా మనసును అర్థం చేసుకున్నావు. ఆడపిల్లయినా, మగపిల్లవాడయినా తల్లిదండ్రుల బాధ్యత తీసుకోవలసినదే. మనలను కూడ వాళ్లలాగే కన్నారు కదా. ఏవరో బాధ్యతారాహిత్యంగా ఉన్నారని నేను అలా ఉండలేను. నేనింతే..ఏదయినా భరించాలనే నా నిర్ణయం. మిగతాది భగవదేచ్ఛ. ఉంటాను ప్రవరా" అని ప్రవర్థినికి వీడ్కోలు చెప్పి ఇంటి మలుపు తిరిగింది కుసుమ.

కన్నవారిని భారంగా తలచి విదేశాలకు ఎగిరిపోయి చేతులు దులుపుకుని, మొక్కుబడిగా డబ్బులు పంపి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో చేర్చి అదే ఘనతగా భావించే కొడుకులున్న ఈరోజులలో, కుసుమ వంటి కూతురు ఉండడం ఆ తల్లిదండ్రులు చేసుకున్న పుణ్యం. ఇంటికొక్క కుసుమ లాంటి ఆడపిల్ల ఉంటే, ఇక ఆశ్రమాలతో పని ఉండదేమో.....

**** అయిపోయింది********

# తెలుగు కళా సమితి

## Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

New Jersey, USA

**Delicious Dinner**



Time: 5:30 to 7:00pm

# ఉగాది సంబరాలు

# Ugadi Sambaralu

On Saturday, **April 22,** 2023
3:00 pm onwards

**Venue:**
Sayreville War Memorial High School,
820 Washington Road, Parlin, NJ 08859

**ROBOTIC EXPO** by TFAS Youth

**Youth Public Speaking Contest**

**Women Empowerment Seminar**



**KANTARA**
a divine performance

విశ్వనాధ స్మృత్యాంజలి






Tribute to Actress Jamuna



**Panchanga Sravanam**





**Bhagavath Geetha Antyakshari by kids**



**Bhadrachala Ramadasu-Skit**

**Musical Night by:**



Sandeep Kurapati



Akhila Mamandur

& other Local Singers



**Scintillating Cultural Performances**

**TICKET PRICES**

| | |
|---|---|
| VIP | $100 |
| GOLD | $50 |
| Family of 4 | $35 |
| Family of 3 | $25 |
| Member | $10 |
| Non Member | $12 |

digitalaya • +91 9246 578 478

**Registration:**

**Ugadi Celebrations:** https://tinyurl.com/tfasugadi2023registration

**Public Speaking Contest:** https://tinyurl.com/tfasugadi2023speakingcontest

**Cultural Performances:** https://tinyurl.com/ugadi2023culturalregistration

**Last Date of Cultural Performance: April 14, 2023**

**Sponsors**

TANA, NATS, ATMIYA, MATA, VASAVI DEVELOPERS USA, RAO NETWORK, BHOG, Zenith SERVICES INC. EMPOWERING TALENT, WOODLANE PHARMACY, SWARA MEDIA https://swara.media, NATA, ATA, SAI DATTA PEETHAM, CITIAIR, NEW YORK LIFE, issi, MOVERS.Com, Andee Plaza Pharmacy "ExtraOrdinary Reach – UnConditional Care", SOMIREDDY LAW GROUP, RK Jewels Iselin, NJ

**For additional information:**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025

# ఆనందోత్సాహాలతో జరిగిన న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారి ఉగాది సంబరాలు

న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారు శ్రీ శోభకృతు నామ సంవత్సర (2023) ఉగాది సంబరాలను శనివారం, ఏప్రిల్ 22,2023న తెలుగు కళా సమితి కార్య వర్గం ఆధ్వర్యంలో స్థానిక సేరెవిల్లే వార్ మెమోరియల్ హై స్కూల్, సేరెవిల్లే లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కన్నుల విందుగా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 1200 మంది తెలుగు వారు పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. తెలుగు కళా సమితి కార్య వర్గం జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతం లతో మధ్యాహ్నం 3:30 గంటలకు కార్యక్రమం ప్రారంభించారు. శ్రీమతి సప్నా మాదిరాజ గారు మరియు శ్రీ మధు దౌలపల్లి గారు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు

ఈ సందర్భంగా తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ మధు రాచకుళ్ళ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు కళా సమితి చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి తెలుగు వారి నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ మధు రాచకుళ్ళ మాట్లాడుతూ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా మొట్ట మొదటిసారిగా మహిళా సదస్సు, అంతర్జాతీయ రోబోటిక్స్ ప్రదర్శన











మరియు పబ్లిక్ స్పీకింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించి తెలుగు కళా సమితిని మరింత దృఢంగా తెలుగు ప్రజలకు దగ్గర చేశామని తెలియ చేసారు. కార్యదర్శి శ్రీ రవి అన్నదానం తెలుగు కళా సమితి కార్యవర్గాన్ని సభికులకు పరిచయం చేశారు.

ఈ తెలుగు కళా సమితి ఉగాది సంబరాల కార్యక్రమాలలో సుమారు 250 పిల్లలు, పెద్దలు భాగస్వాములయ్యారు. అద్భుతమైన మధురమైన కార్యక్రమాలను ప్రదర్శించారు. సంప్రదాయేతర ఉపాధులను ఎంచుకున్న మహిళలతో శ్రీమతి సునీత క్రోసూరి ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీమతి శాంతి నర్రా, శ్రీమతి శాంతి ఎప్పనాపల్లి, శ్రీమతి లక్ష్మి కోట, శ్రీమతి ఉష ఆకెళ్ళ, శ్రీమతి హేమ కంఠమనేని, శ్రీమతి లక్ష్మి మోపర్తి, శ్రీమతి రాగిణి, శ్రీమతి స్వర్ణ గేదల, శ్రీమతి శశి గుండాల మున్నగువారు పాల్గొన్నారు.

ఈ ఉగాది సంబరాలలో తెలుగు కళా సమితి వారు సమర్పించిన శ్రీ విశ్వనాథ్ స్మృత్యంజలి ని శంకరాభరణం సినిమాలోని ఓంకార నాదాను సంధానమౌ గానమే శంకరాభరణము పాటతో శ్రీ శ్రీకర్ ధర్భ ప్రారంభించారు. సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్ స్కూల్ (శ్రీమతి ఇందిరా శ్రీరామ్ రెడ్డి) వారు సప్తపది సినిమా లోని పాటల మెడ్లీ ను (అఖిలాండేశ్వరి,మరుగేల రా,నెమ్మలికి నేర్పిన) సమర్పించారు. శృతిలయలు సినిమా లోని పాటను (ఆలోకయే బాలకృష్ణ) చిన్మయి నృత్యాలయ స్కూల్(శ్రీమతి శ్రీదేవి ముంగర) వారు సమర్పించారు. ఆపద్బాంధవుడు సినిమా లోని పాటను (ఔరా అమ్మకచెల్లా) ప్రణవం డాన్స్ స్కూల్ (శ్రీమతి ప్రణయ ఆకుల) వారు సమర్పించారు. స్వర్ణ కమలం సినిమా లోని పాటను (అందెల రవమిది) నృత్యమాధవి డాన్స్ స్కూల్ (శ్రీమతి దివ్య ఏలూరి) వారు సమర్పించారు. రామదాసు భజనలను శ్రీమతి రేఖ బ్రహ్మ సముద్రం గారు సుమారు 35 మంది తో అద్భుతంగా ఆలాపించారు.

శ్రీ అశోక్ చింతకుంట ప్రధాన పాత్రధారిగా ( రామదాసు) భద్రాచల రామదాసు అనే చిన్న భక్తి నాటకమును శ్రీ రవి కామరసు, శ్రీ హరికృష్ణ ముత్యాల, శ్రీ శివనాగహరి, శ్రీ సుధాకర్ పెద్దిరెడ్డి మున్నగువారు ప్రదర్శించారు. అలనాటి అందాల నటి కీర్తిశేషులు శ్రీమతి జమున గారికి స్మృత్యంజలి ఘటిస్తూ, జామున గారు వివిధ పాత్రల్లో ధరించిన సంప్రదాయ వస్త్రధారణ లతో కుమారి తాలికా ఎల్లావుల ప్రదర్శించిన ఫ్యాషన్ షో అందరిని అలరించింది. కాంతారా సినిమా లోని పంజుర్లి పాత్రధారి గా శ్రీ శేషగిరి కంభంమెట్టు మరియు కళాంజలి డాన్స్ స్కూల్ విద్యార్థినులతో శ్రీమతి సుధా దేవులపల్లి గారు కొరియాగ్రఫీ చేసిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకొంది. ప్రేక్షకుల హర్షధ్వానాలు, చప్పట్లతో వేదిక ప్రాంగణం మార్మోగిపోయింది. అంతర్జాతీయ రోబోటిక్స్ ప్రదర్శనను శ్రీ వెంకట సత్య

తాతా గారు,  శ్రీ తిరు వున్న గారు, శ్రీమతి ఉమా తులిమెళ్ళ గారు, శ్రీరామ్ తులిమెళ్ళ గారు, శ్రీ రవి మహీధర గారు, శ్రీమతి అనితా అమర్ గారు, నిర్వహించగా  న్యాయ నిర్ణేతలుగా  శ్రీమతి రీనా గుప్తా గారు, శ్రీరామ్ తులిమెళ్ళ గారు, శ్రీమతి అన్నపూర్ణ బిక్కిన గారు, శ్రీ సీతారామయ్య సుంకు గారు వ్యవహరించారు. సుమారు 25 మంది పిల్లలతో  భగవద్గీత అంత్యాక్షరి కార్యక్రమాన్ని శ్రీ కృష్ణ కుమార్ జోస్యుల గారు, శ్రీమతి వందన వెంకట్ గారు, నిర్వహించారు. పబ్లిక్ స్పీకింగ్ కార్యక్రమాన్ని శ్రీమతి జ్యోతి కామరసు గారు, శ్రీమతి శ్రీవిద్య మణికొండ గారు, శ్రీమతి ప్రతిభ ఇసుకపల్లి గారు నిర్వహించగా న్యాయ నిర్ణేతలుగా శ్రీమతి వైదేహి చిట్నీస్ గారు, శ్రీ సూర్య వంగల గారు, శ్రీ శేష కిరణ్ గారు వ్యవహరించారు.

తెలుగు కళా సమితి ఉపాధ్యక్షురాలు  శ్రీమతి బిందు యలమంచిలి గారు మహిళా సదస్సు, ఆర్థిక వ్యవహారముల పర్యవేక్షణలను నిర్వహించటంతో పాటు, అతిధులందరకూ ఉగాది పచ్చడిని స్వయంగా తయారు చేసి అందచేశారు.కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం  మొత్తం భోజన ఏర్పాట్లు మరియు కార్యక్రమ నిర్వహణ వాలంటీర్ల విషయాలను పర్యవేక్షించారు. మెంబర్ షిప్ కార్యదర్శి శ్రీమతి జ్యోతి కామరసు యువతను సమన్వయ పరచటం మరియు యువతకు వకృత్వ పోటీల (పబ్లిక్ స్పీకింగ్ ) నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. ఇటి కార్యదర్శి శ్రీ నాగ మహేందర్ వెలిశాల మీడియా,ఇమెయిల్ ప్రచారం మరియు అతిధులందరకు భోజన ఏర్పాట్లు వంటి బాధ్యతలను నిర్వహించారు.  ఈ సందర్భంగా తెలుగు కళా సమితికి సేవ చేస్తున్న శ్రీ సురేష్ మాకం, శ్రీమతి శ్యామల దశిక, డాక్టర్ వైదేహి శశిధర్, శ్రీమతి రాగిణి    గారికి ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. తెలుగు కళా సమితి కార్యక్రమాల్లో వాలంటీర్స్ గా పని చేసిన శ్రీమతి జలజ గొల్ల మరియు శ్రీ హర్షవర్ధన్ గొల్ల దంపతులకు, శ్రీ సత్య ప్రకాష్ కొంకిమళ్ల గారికి  ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా దీపావళి సంబరాలకు ధన సహాయం చేసిన దాతలకు, వివిధ సంస్థలకు కార్యవర్గ సభ్యులు సన్మానం చేశారు. శ్రీ సందీప్ కూరపాటి, కుమారి అఖిల మామండూర్, మధు దౌలపల్లి, శ్రీకర్ దర్భా, లావణ్య అందె మరియు శ్రీజ బొడ్డు  బృందం పలు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఓలలాడించారు.

ఈ













కార్యక్రమానికి తెలుగు కళా సమితి సలహాదారులు శ్రీ హరి ఎప్పనాపల్లి గారు, శ్రీమతి రాధా కాశీనాధుని గారు,శ్రీ రాజారావు బండారు గారు, మాజీ అధ్యక్షులు శ్రీ రామకృష్ణ సీతాలు గారు, శ్రీ దాము గేదల గారు, శ్రీ శ్రీనివాస్ గండి గారు, శ్రీ సుధాకర్ ఉప్పల గారు, మాజీ కార్యవర్గ సభ్యులు శ్రీ శంకర










బాధ్యతలను  పర్యవేక్షించారు. కోశాధికారి శ్రీ శ్రీనివాస్ చెరువు గారు ఈ ఉగాది కార్యక్రమం టిక్కెట్లు అమ్మకం, రిజిస్ట్రేషన్ డెస్కు నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతలను స్వీకరించిన యువజన కార్యదర్శి శ్రీమతి సుధా దేవులపల్లి గారు ఈ ఉగాది సంబరాల సాంస్కృతిక కార్యక్రమాల రూపకల్పన చేసి, సమర్ధవంతంగా నిర్వహించారు. వెండర్స్ నిర్వహణ మరియు అంతర్జాతీయ రోబోటిక్స్ ప్రదర్శనను కమ్యూనిటీ కార్యదర్శి  శ్రీ వెంకట సత్య తాతా నిర్వహించారు. కొత్తగా కార్యవర్గంలో చేరిన అనిల్ వీరిశెట్టి రావు పోలేపల్లి, శ్రీమతి ఉమా మాకం గారు, శ్రీ సురేష్ మాకం గారు, శ్రీ సత్య నేమాని గారు, శ్రీ వంశీ కొప్పరావూరి గారు,శ్రీమతి జ్యోతి గండ గారు, శ్రీమతి ప్రమీల గోపు గారు, శ్రీమతి ఉషా దరిశిపూడి గారు, శ్రీమతి అను పారా గారు, శ్రీ పేరి దివాకర్ గారు (తెలుగు జ్యోతి  మాజీ సంపాదకులు )  మరియు వివిధ తెలుగు సంఘాల  ప్రతినిధులు - తానా నుండి తానా అధ్యక్షులు శ్రీ లావు అంజయ్య చౌదరి గారు, శ్రీ  శ్రీని లావు గారు, శ్రీ జనార్దన్ నిమ్మలపూడి గారు, శ్రీ రవి పొట్లూరి గారు,శ్రీ రాజా కసుకుర్తి గారు, శ్రీ శ్రీనివాస్ నాదెళ్ల గారు, శ్రీ  నరేన్ కొడాలి గారు, శ్రీ






తెలుగు కళా సమితి


0%
LISTENING
100%
GAMING


తెలుగు కళా సమితి






తెలుగు కళా సమితి


తెలుగు కళా సమితి




తెలుగు కళా సమితి


తెలుగు కళా సమితి


తెలుగు కళా సమితి








OR NOT AT ALL.
NINJA BOTS
#26738







విద్యా గారపాటి గారు, శ్రీ శ్రీనివాస్ ఓరుగంటి గారు, శ్రీ సాయి బొల్లినేని గారు, శ్రీ ఠాగూర్ మల్లినేని గారు, శ్రీ శ్రీనాథ్ కోనంకి చౌదరి గారు, శ్రీమతి శివాని తన్నీరు గారు, నాట్స్ ప్రతినిధులు శ్రీమతి అరుణ గంటి గారు, శ్రీ రాజ్ అల్లాడ గారు, శ్రీ శ్యాం నాళం గారు, శ్రీ ఓం మడూరి గారు, శ్రీ బసవ శేఖర్ గారు, శ్రీమతి దీప్తి నాగ్ యాయవరం గారు, శ్రీ అరుణ్ శ్రీరామనేని గారు, టిటిఎ నుండి శ్రీ మధుకర్ రెడ్డి దేవరపల్లి గారు, శ్రీ సాయి గూడూరు గారు, శ్రీ శ్రీనివాస్ గూడూరు గారు , శ్రీమతి స్వాతి & శ్రీ అట్లూరి దంపతులు (కళా వేదిక), ఆత్మీయ సంస్థ నుండి శ్రీ ఓం ప్రకాష్ నక్కా గారు, శ్రీ రమేష్ నయనాలశెట్టి గారు, శ్రీ సత్య వెజ్జ గారు, శ్రీ వెంకట్ నాగిరెడ్డి గారు, మురళి గర్రె గారు, ఈ మధ్యనే కొత్తగా ఆవిర్భవించిన మాటా ప్రతినిధులు శ్రీ శ్రీనివాస్ గనగోని గారు, శ్రీ కిరణ్ దుడ్డాగి గారు, శ్రీ విజయ భాస్కర్ కల్లాల్ గారు, శ్రీ శ్రీధర్ చిల్లర గారు, శ్రీ రవి దన్నపునేని గారు,శ్రీ రఘు రెండుచింతల గారు, శ్రీ సురేష్ కజనా గారు, శ్రీమతి ఉషా చింతా గారు(NATA), శ్రీ సుబ్బారావు సన్నిధి గారు (వాసవి), శ్రీ మధు అన్నా (GSKI), శ్రీమతి లక్ష్మి & ప్రవీణ్ గూడూరు దంపతులు (SPBMI), శ్రీమతి విజయ సప్పా (NJTA) తదితరులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఆర్థిక సహాయం చేసిన స్పాన్సర్లు న్యూయార్క్ లైఫ్, శ్రీ శ్రీనివాస్ తుమ్మల గారికి, శ్రీ విద్యా గారపాటి గారు, శ్రీ వంశీ వాసిరెడ్డి గారికి, శ్రీ హరి ఎప్పనాపల్లి గారికి, శ్రీ శ్రీనివాస్ గూడూరు గారికి, శ్రీమతి రాధా కాశీనాధుని గారికి, శ్రీమతి లక్ష్మి రాచకుళ్ళ గారికి, శ్రీమతి వరలక్ష్మి మరియు రవి కృష్ణ అన్నదానం దంపతులకు, శ్రీమతి సుధా దేవులపల్లి గారికి, శ్రీమతి చంద్ర తమ్మినీడి గారికి, శ్రీ కిరణ్ దుడ్డాగి గారికి, శ్రీ శ్రీధర్ చిల్లర గారికి,తెలుగు కళా సమితి కార్యవర్గం ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించిన మీడియా ప్రతినిధులు శ్రీమతి శ్రీ ఆనంద్ గారు, శ్రీమతి స్వాతి నల్లూరి గారికి, శ్రీ శరత్ పసుమర్తి గారికి, శ్రీ కృష్ణ గారికి, శ్రీ సుందర్ గారికి తెలుగు కళా సమితి కార్యవర్గం కృతజ్ఞతలు తెలియచేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ విభాగాలలో కష్ట పడిన వాలంటీర్స్ శ్రీ హర్ష గొల్ల గారు, శ్రీ రవి నారవ గారు, శ్రీ రవి మహీధర గారు, శ్రీ సీతారాం సుంకు గారు, శ్రీమతి ప్రతిభ ఇసుకపల్లి, శ్రీ కళ్యాణ్ కుమార్ దేశపాండే గారు, శ్రీ ప్రసాద్ మానికొండ గారు, శ్రీ రవి రాచూరు గారు, శ్రీమతి బసవలక్ష్మి & ప్రభాకర్ కాటేపల్లి దంపతులు, శ్రీ అన్నాజీరావు వడ్లమాని గారు, శ్రీ రావు వక్కలగడ్డ గారు, శ్రీమతి ఉమా మాకం గారు, శ్రీమతి వరలక్ష్మి అన్నదానం గారు, శ్రీమతి లక్ష్మి రాచకుళ్ళ గారు, శ్రీమతి నాగేశ్వరి చెరువు గారు, శ్రీమతి సరితా వెల్లూర్ గారు, శ్రీమతి కాంతిశ్రీ పూసపాటి గారు, శ్రీమతి జలజ & హర్ష గొల్ల దంపతులు, శ్రీమతి లక్ష్మి చిత్ర సుంకు గారు, శ్రీమతి శిరీషా చిర్రా గారు, శ్రీమతి రత్నశ్రీ ఖండవిల్లి గారు, శ్రీమతి మానస కోడేటి గారు , శ్రీమతి జ్యోతి పచవా గారు శ్రీమతి శ్రావణ మల్లాది గారు తదితర వారందరికీ కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం పేరు పేరునా ధన్యవాదాలు చెప్తుతూ జనగణమన జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.

ఈ ఉగాది సంబరాల వేదికను అలంకరించిన శ్రీమతి గిరిజా మాదాసి గారిని, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసిన శ్రీ పాల్ బిగువు గారిని, ఈ ఉగాది వేడుకలను చక్కగా చిత్రీకరించిన ఫోటోగ్రాఫర్ ఆనంద్ గారిని మరియు రుచికరమైన భోజనం అందించిన భోగ్ రెస్టారెంటు వారికి తెలుగు కళా సమితి కార్యవర్గం ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేసింది. తెలుగు కళా సమితి కార్యవర్గం ఈ వేడుకలను బాగా నిర్వహించిందని, సంప్రదాయాన్ని మరచిపోకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు వక్తలంతా తెలుగు కళా సమితి ను అభినందించారు.

SOMIREDDY LAW GROUP
WOODLANE PHARMACY
RAO NETWORK
we thrive with teamwork
Zenith SERVICES INC.
EMPOWERING TALENT
RK Jewels
Iselin, NJ
MOVERS.Com

## మమతల దారుల్లో...

వంజారి రోహిణి

ప్రయాణం కొత్తమజిలీకి
ఇదివరకెన్నడూ చూడని దారి
ఆశలు దీర్ఘాలై
భయాలు హ్రస్వాలై
ముందుకు సాగే పయనం
అలుపొచ్చి ఆగిపోతే సేదదీరడానికి
అమ్మ పాడిన జోలపాటని
గుండె ఊయల్లో దాచుకుని వెళుతున్నా..
బాటలో పరాకుగా అనిపిస్తే
ఉల్లాసం పొందడానికి
చెల్లి తమ్ముడుతో పెట్టుకున్న
చిలిపి తగాదాలు
వెన్నెల్లో కలిసి పంచుకున్న అన్నం ముద్దలు
వర్షంలో తడుస్తూ ఆడుకున్న ఆటలు
అన్నింటిని జ్ఞాపకాల ట్రంకు పెట్టెలో
భద్రంగా దాచుకుని వెళుతున్నా..
బాటలో అన్నీ కొత్త ముఖాలే
ఎప్పుడూ తారసపడని వ్యక్తిత్వాలు
బెరుకు కలిగితే
కుడిభుజంలా నాన్న ఇచ్చిన ధైర్యాన్ని
ఆసరాగా వెంట తీసుకువెళ్ళుతున్నా..
పయనంలో కొండలు లోయలు
దాటాల్సివచ్చినా
ప్రవాహం వెంట గమనాన్ని
సాగించాల్సివచ్చినా
ఎన్నడూ నీ చేయి విడువనని
అక్కున చేర్చుకున్న
జీవన సహచరుని చిటికిన వేలు పట్టుకుని
కొత్త జీవిత మజిలీలోకి ఇష్టంగా వెళుతున్నా
మమతల పందిరిని అల్లుకుంటూ..

## మనం అనుకుంటాం గాని---

పాండ్రంకి సుబ్రమణి

అనుకుంటాం గాని మనిషి మనుగడకు బ్రతుకు దారికి
మమకారపు మకుటమే అనివార్యమని తథ్యమని—
తరచి చూస్తే విప్పిన కొత్త పొత్తంలా తెలియదూ
ములుకుల్లేని కరకుల్లేని మృదువైన మాటొకటి చాలని.
గుండెల్లో నిబ్బరాన్ని నింపడానికి,నిటారుగా నిడవడానికి
ఆశల అగాధాల్లో పడిలేస్తూ కనిపించేదంతా మనదేననుకుంటే ఎలా?
నిజానికిప్పుడున్నదంతా ముఖమెరగని తరమెరుగని ఆగంతకుడిదేగా!
ఇక చెప్పాలంటే రేపు పేలపిండిలా యగిరి చెదరిపోయే మట్టిపొరేగా ఇది!
పతంగ విహారాలకు వెళితే ఉల్లానికి ఉల్లాసమేమోగాని
మనసున వెలితి మాత్రమే మిగిలితే దిలాసా ఎలా దక్కుతుంది?
ఆరాటపడి అంగలార్చితే మత్తు మోహసముద్రం చెలరేగుతుంది గాని
ఆనందార్ణవం మనసు సరస్సున ఎలా విచ్చుకుంటుందని --
తనువున నిలకడనిచ్చే నిర్మలానందం ఎలా దక్కుతుందని--
నవనీత లేపనం కోసం అనవరతం ఎంతగా వెతుకుతుంటామో--
వ్యథిత హృదయానికి చల్లని కరుణ తరంగమొకటి చాలదూ!
కష్టకాలంలో ఖగోళం వేపు చేతులు చాచి ఆక్రోశిస్తాం గాని -
చిన్నటి మల్లెపువ్వొకటి అమాయకంగా నవ్వితే చాలదూ
గుండెలోతున సాంత్వన చెందటానికి కడలంతటి ఊరటపొందటానికి--
సుఖప్రాప్తికై ధనాంధుల జాలి చూపులెందుకు —
ప్రేమ చూపు గల చల్లని తల్లి మనసొకటి చాలదూ!
రేపటి చీకటిలో కపటమెరుగని కరుణ ధారొకటి చిందిస్తే చాలదూ —
మరులు గొల్పడానికి నడిరోడ్డున అచ్చువేసిన రంగు ముఖాలెందుకు —
నిండు బిందెలాంటి యిల్లాలి రూపం చాలదూ నగుమోము పూయడానికి!

# ఏ ఊరు ఏ తీరు ఓ తెలుగు మనిషీ!!

దాసరి అమరేంద్ర

"మా అమ్మ తరపు వాళ్ళు 150 ఏళ్ల క్రితం తమిళదేశం నుంచి ఆంధ్రా వచ్చారు. నేను 21 ఏళ్ల దాకా ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున పుట్టి పెరిగి, గత 40 ఏళ్లుగా ఢిల్లీలో ఉంటున్నాను. మా సహచరి - వాళ్ళ నాన్న ఉద్యోగరీత్యా - చిన్నప్పటినుంచి దేశం నలుమూలలా తిరిగి పెరిగింది. మా పిల్లాడు ఢిల్లీలో పుట్టి, బెంగళూరు అహ్మదాబాదుల్లో చదివి, తమిళనాడు, కర్ణాటకలో ఉద్యోగం చేసి, ఇప్పుడు మహారాష్ట్రలో పరిశ్రమ పెట్టుకుని నడుపుతున్నాడు. వాళ్ళావిడ తమిళ-ఒడియా దంపతుల బిడ్డ. వారణాసిలో పుట్టి పెరిగింది. వీళ్ళందరికీ వచ్చిన భాష హిందీ. ఇంగ్లీషు సరే సరి. ఇప్పుడు వాళ్లకు ఓ పాప. ఆ పాప మాతృభాష ఏమిటవుతుంది?" అని ఏదో సాహిత్య అకాడమీ సెమినార్ లో ప్రధాన వక్తని అడిగాను. క్షణం ఆలోచించి, "ఏ భాషలో సులువుగా తను తనను తాను వ్యక్తపరచుకుంటుందో అదే ఆమె మాతృభాష. బై ది వే, భాష జెనెటిక్ కాదు" అన్నారాయన. విస్తుపోయాను. నమ్మలేదు. ఆలోచించాను. శోధించాను. భాష జెనెటిక్ కానే కాదని అర్థమైంది. మరి భాషాపరంగా, మనకు వారసత్వ సంపదగా వచ్చిన సంగీతం, సాహిత్యం, సామెతలు, జాతీయాలు, 'దేశభాషలందు తెలుగు లెస్స' అని పొంగిపోవడాలు, ఎవరికీ లేనన్ని అక్షరాలు మనకు ఉన్నాయని, తేట తేట తెలుగనీ, వెయ్యేళ్ళ భారతమనీ ఛందస్సనీ అవధానాలనీ..... అంతా భ్రాంతియేనా?!

అసలు ఏ తెలుగు గురించి మాట్లాడుతున్నాం? తత్సమమా, తద్భవమా, దేశ్యమా, గ్రాంధికమా, వ్యావహారికమా, వాడుక భాషా?

ఏ యాస గురించి? నెల్లూరు యాసా? కళింగ బాసా?

ఏ మాండలికం? చిత్తూరా? గుంటూరా తెలంగాణానా...

జెనెటిక్కే కాని ఈ భాష గురించి ఎన్ని భ్రాంతులు?!

మన ముత్తాత వచ్చి అప్పటి తన భాషలో మాట్లాడితే అర్థం చేసుకోగలమా? 1838 నాటి కాశీ యాత్ర చరిత్ర', 1934 నాటి వేయి పడగలు - అవి మన తరానికే కొరకుడుబడవు. ఖండంతరాలూ దేశాంతరాలూ వెళ్లి అక్కడి భాషా యాసా నేర్చుకున్న పిల్లల మీద వాటిని రుద్దగలమా?! 'మాతృభాష' అంటున్నాం – సంస్కృతంలో! ప్రేమించమంటున్నాం, గర్వించమంటున్నాం, తక్కువ భాషల్ని హేళన చేస్తున్నాం...

ఒక విషయం ఆలోచిద్దాం.

మనమంతా లిపిలేని కొంకణి భాషాప్రాంతాల్లోనో, సాహిత్యం ఇంకా మొదలవని గిరిజన భాషా ప్రాంతాల్లోనో పుట్టి పెరిగి ఉంటే ఆ భాషనే ప్రేమిస్తామా లేదా?

* * *

"అయ్యయ్యో, ఏమిటా విరగబాటు - పంజాబీ డ్రస్సట పంజాబీ డ్రస్సు!!" - అరవైలలో నేను విన్న నిరసన.

"సిగ్గు అనేది ఉండక్కర్లా? ఏమిటో నైటీలట. ఇంట్లోనే అయినా అవి వేసుకొని తిరగడానికి సిగ్గు శరం ఉండక్కర్లా?" ఇది ఎనభైల నాటి మాట.

సంక్రాంతి అనగానే పట్టు లంగా-పరికిణిలో ముచ్చటైన ఆడపిల్లల బొమ్మలు పత్రికల్లో ఇప్పటికీ కనబడతాయి. పెళ్లి అనగానే ఎనిమిది గజాల సిల్క్ చీరలు విత్ వడ్డాణం - ఇవి మన దుస్తులు, మన సంప్రదాయం.

ఈ అరవై ఏళ్లలో - నాకు తెలిసిన కాలవ్యవధిలో - పంజాబీ డ్రెస్ ఎంతో మర్యాద అయిన వస్త్ర విశేషం అయిపోయింది. నైటీ అన్నది - అందరూ - ముఖ్యంగా అప్పట్లో విరుచుకుపడి, ఇప్పుడు చీర కట్టుకునే ఓపిక లేని పెద్దవాళ్ళు ఇష్టపడే విషయమైంది.

చీర స్థానం అప్పటికీ ఇప్పటికీ అలాగే నిలిచి ఉంది అన్నది అందరూ ఒప్పుకునే చారిత్రక వాస్తవం.

మగవాళ్ళ వస్త్రధారణే మరీ అప్రాచ్యమైపోయింది - ఇంగ్లీషు వాళ్ళ పుణ్యమా అని! పాంటు-షర్టు-కోటు – అబ్బే, మనవి కానే కాదు. దిగుమతి సరుకు. మొన్నటిదాకా రాజశేఖర రెడ్డి పంచెకట్టులో ఎంత హుందాగా ఉండేవాడూ? ఇప్పటికీ మనలో కొద్దిమంది మగవాళ్ళు ప్రత్యేక సమయాల్లో తీరైన పంచెకట్టులో వచ్చి తెలుగుదనాన్ని నిలబెడుతున్నారు గదా...

ఆగండాగండి - 'కుళ్ళాయుంచితి, కోక చుట్టితి, మహాకూర్పాసముందొడిగితి – అన్నదెవరూ?? శ్రీనాధుడు కాదూ?! మీర్జా గాలిబ్ బాణీ పొడవాటి టోపీ, పంచె, ఆ పైన అంగరఖా వేసుకున్నానని కాదూ ఆయనన్నది? ఆయన

తెలుగు వాడేనా? తిరుపతిలోని శిలారూపపు కృష్ణదేవరాయలు ఏ రకం దుస్తులు ధరించాడూ? తెలుగుతనమున్నవేనా? అసలు తెలుగు వస్త్రధారణ అంటూ అప్పటికీ ఇప్పటికీ నిలిచి ఉన్న పద్ధతి ఏమైనా ఉన్నదా?

* * *

"మన పండుగలూ ఆచారాలూ చూడండి... ఎన్ని వందల ఏళ్ళు గడిచినా మన వివాహ కార్యక్రమం అలానే ఉంది. సంక్రాంతి, ఉగాదిలాంటి పండుగలని మనం జరుపుకునే తీరే వేరు..."

ఔనా? నిజమేనా?!

అప్పటి సామాన్యులూ, ప్రభువులూ ఒకే విధంగా జరుపుకున్నారా? ఉన్నత వర్ణాల వారూ, నాలుగూ ఐదూ వర్ణాల వారూ ఒకే రకంగా జరిపారా? అందరి పద్ధతీ ఒకటేనా? మరి అవి వేరు వేరు ఐనప్పుడు, 'మా పద్ధతి, మా ఆచారం, మా సాంప్రదాయం' అనడం సబబేనా? చదువు పుణ్యమా అని సామాన్యులు కూడా విశాలవిశ్వంలో అడుగు పెట్టి, కొత్త వృత్తులు చేపట్టి కొత్త సంపదలను సాధించుకొంటున్నప్పుడు - సంప్రదాయాలు సంపదకు వశమవ్వలేదా?

ఇక్కడ ఇంకొక్క మాట.

మెహందీ సంబరం, సంగీత్ హడావుడి, రిసెప్షన్ వేడుక (పెళ్ళి రేపు తెల్లవారుఝామున, రిసెప్షన్ ఇవాళ సాయంత్రం!!) - ఇవన్నీ డబ్బున్న తెలుగువాళ్లు ఇప్పుడు చేస్తున్న పనులు కావూ? వీటిల్లో సంప్రదాయాలూ, ఆచారాలూ, వెదకడం భావ్యమా? వీటికి తోడు ఓణీల పండుగ, పంచెల పండుగ అంటూ కొత్త కొత్త సంప్రదాయాలను డబ్బిచ్చి కొని తెచ్చుకుంటున్నాం గదా? ఏవి తల్లీ నిరుడు విలసిల్లిన ఆచార సంప్రదాయాలూ? ఏవీ తెలుగుదనాన్ని ప్రతిబింబించే వేడుకలూ వినోదాలూ ఎక్కడ?

* * *

'మేము ఆర్గానిక్ ఫుడ్ తప్ప తినమండీ' అంటాడు ఇప్పటి ఉన్నత మధ్య తరగతి తెలుగు వాడు. ఐనా పండగొస్తే పరమాన్నం, అరిసెలు, బూరెలు తింటున్నారు గదా మన తెలుగు సోదర సోదరీమణులూ అంటారా?! నిజమే కానీ -

ధవళేశ్వరం రాక ముందు అక్కడి వారు వరి అన్నం తినగలిగారా? వచ్చిన తరువాత కూడా మెట్ట ప్రాంతాలవాళ్ళు జొన్నలే గదా తిన్నదీ! 'తెలుగు భోజనం' అని మన మధ్య యుగాల సాహిత్యం కొనయాడే భక్ష్యాలు అప్పట్లో ఎందరికి అందుబాట్లో ఉండేవి? ఏది దొరికితే అది తినే కదా, వేలాది సంవత్సరాలుగా సగటు తెలుగు మనిషి మనుగడ సాగించిందీ? తరచూ వచ్చే దారుణమైన కరువుల్లో మరణించిన వాళ్ళ డొక్కలు చీల్చి ఆ మెతుకులు మింగిందీ?! డొక్కా సీతమ్మ వితరణ వల్ల వేలాది గోదావరీ ప్రాంతపు ప్రాణాలు నిలబడ్డాయన్నది వందా నూట పాతికేళ్ళనాటి సంగతేగాదూ?! ఆవిడ తెలుగు భోజనం పెట్టారా - ప్రాణాలు కాపాడే తిండి పెట్టారా?!

* * *

తెలుగువారికి ప్రత్యేకంగా మతమంటూ ఉందా? నాగార్జునాచార్యుని సమయంలో బౌద్ధం, అమరావతి, ఘంటసాల, భట్టిప్రోలు, తొట్లకొండ, శాలిహుండం.

అలాగే వైష్ణవం, రామానుజాచార్యులు, శైవం, శంకరాచార్యులు బలంగా ఉన్న కాకతీయుల కాలంలో కూడా కొలనుపాక జైనం రాజ్యమేలలేదూ?

ఇప్పుడు కూడా శిర్డీ మనది. శబరిమల మనది. సంతోషిమాత మనది. వైష్ణోదేవి మనది.

ఇవే కాకుండా మనం వేళాంగణి వెళ్తాం. దర్గా మిట్టకు వెళ్తాం. నిన్నా మొన్నటి దాకా పీర్ల పండగ మన గ్రామాల్లో ఉమ్మడి సంబరం. ఇప్పుడు నగరాల్లో - ముఖ్యంగా విదేశాల్లో - క్రిస్మస్ అందరి పండగ.

మరి తెలుగు మతం అంటూ వేరే ఉందా?

ఉంటే గ్రామ దేవతల రూపంలో ఉంది. మైసమ్మ, పోతురాజు, రేణుకమ్మ, తెలుగు మూలాలు ఉన్న దేవతలు వీరు. క్రమక్రమంగా మైసమ్మ మహిషాసుర మర్దిని ఐపోతోంది. దేశ విదేశాల్లో ఆరాధించబడే రాముడు కృష్ణుడు, శివుడు – మనకే కాదు - దేశమంతటికీ దేవుళ్ళు.

* * *

ఆచారాలు, అలవాట్లు, భాష, ఆహారం, దుస్తులు, సాంఘిక ప్రవర్తన, నీతి నియమాలు, జీవన విధానం, కళలు, సాహిత్యం - ఇవన్నీ కలిసినదే సంస్కృతీ-సంప్రదాయం.

ఈ సంస్కృతి అన్నది నిలవనీరు కాదు.

మార్పు దాని సహజ లక్షణం.

ప్రాంతాల బట్టీ, కాలాల బట్టీ, వాతావరణాల బట్టీ, ప్రాకృతిక వనరులబట్టీ అది మారుతూ ఉంటుంది.

ఉదాహరణకు నిన్న మొన్నటిదాకా అందరూ ఆమోదించిన సతీ సహగమనాన్ని ఇప్పుడెవరైనా కీర్తిస్తే, ప్రవచిస్తే - వారిని జైల్లోనో ఆసుపత్రిలోనో పెడతారు.

1923 నాటి భాషలో ఇప్పుడెవరైనా మాట్లాడితే 'బాబూ మాకర్థమయ్యేలా తెలుగులో మాట్లాడండి' అంటాం. కుళ్ళాయి కట్టుకుని అంగరఖా తొడిగి వీధిలోకి వస్తే, ఏదో డ్రామా కంపెనీ మనిషనుకుని వదిలేస్తాం.

జొన్నకూడు, దిబ్బరొట్టి, చద్దన్నం అంటే నగరాలు నవ్విపోతాయి – అవి ఫాషనుగా మారితే అది వేరే మాట.

'మతములన్నీ మాసి పోవును - జ్ఞానమొక్కటి నిలచి వెలుగును', అన్నాడు మన మహాకవి.

జ్ఞానం అన్న పదం స్థానంలో మానవత్వం అనే మాట ఉంచితే, పై మాటలు ఇప్పటి ఈ చర్చా సందర్భానికి బాగా నప్పుతాయి.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా మనం చెయ్యవలసింది భారతినో తెలుగు తల్లినో పొగడటం మాని, ప్రాంతీయ ఛాందసాలను ఛేదించుకుని, మనసుని విశాలపరచుకోవడం.

మనలో మానవత్వాన్ని నింపుకుని విశ్వపౌరుడిగా వ్యవహరించటం, మనం నమ్మే 'వసుధైవ కుటుంబకం' అన్న పూర్వ విజ్ఞతకు ఆచరణ రూపం అవుతుంది!

***** ****** *****

### ముఖ చిత్రకారుడు - మోకా విజయ్ కుమార్



ఓపిక, తీరిక, ఆసక్తి, సహనంతో పాటు ఆలోచన ఉంటేనే మనసుకు హత్తుకునే చిత్రం రూపొందించగలము. ఇలాంటి లక్షణాలతో మదిలో ఉన్న చిత్రాన్ని హృద్యంగా మలిచి విజయాన్ని పేరులో పదిలపరుచుకున్న మోకా విజయ్ కుమార్ స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్లోని విశాఖపట్నం. గోపాలపట్నంలో ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న విజయ్ కుమార్ చిత్రలేఖనం పై మక్కువతో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ను 'సరనా బసవేశ్వర ఇన్స్టిట్యూట్ ఫైన్ ఆర్ట్స్ లో (1996-1997) పూర్తి చేశారు. 23 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న విజయ్ కుమార్ 'చిత్రలేఖనం' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి ఆసక్తి కలిగిన విద్యార్థులెందరినో కుంచెపట్టుకునేలా చేశారు. విజయ్ శిక్షణలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక మంది ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా మెళుకువలు తెలుసుకుంటూ వారి రంగుల ప్రపంచాన్ని వారే సృష్టించుకుంటున్నారు. చిత్ర సౌందర్యాన్ని మరింత పెంచేలా ప్రతిక్షణం ఆరాటపడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక మందికి శిక్షణ ఇస్తున్న చిత్రకారుడు విజయకుమార్ నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ల వివరాలతో పాటు, తన గూటిలో చేరిన అనేక అవార్డులు, రివార్డులు ఒక్క సారి:

2016 - ఉత్తమ చిత్రకారుడి అవార్డు,హైదరాబాద్లోని శిల్పారామంలో నిర్వహించిన గ్రూప్ ఎగ్జిబిషన్లో
2017 - ఉత్తమ చిత్రకారుడి అవార్డు తానా ఈవెంట్, St Louis, USA లో, సింగపూర్లో ఆర్ట్ క్యాంప్
2018 - ఉత్తమ చిత్రకారుడి అవార్డు, తూర్పుకోస్తా రైల్వే నిర్వహించిన 125 సంవత్సరాల ఉత్సవాల్లో
2019 - సమ్మర్ ఆర్ట్ క్యాంప్/ ఎగ్జిబిషన్/ వర్క్షాప్ లు వివిధ సంస్థల (TFAS NJ, TANA, NATA) ఆధ్వర్యంలో నిర్వహించడం
2020 - ఉత్తమ చిత్రకారుడి అవార్డు (తెలుగు భాష, సంస్కృతీ సంప్రదాయాలకుచేస్తున్న విశిష్ట సేవలకు అందించిన గౌరవ పురస్కారం), క్యాపిటల్ ఏరియా తెలుగు సొసైటీ (క్యాట్స్) వారు నిర్వహించిన 15వ వార్షిక ఉత్సవాల్లో, డిసి మెట్రో ఏరియా, యూఎస్ఏ
2023 - జి-20 సదస్సులో పాల్గొన్న ప్రముఖులకు 'సిరి ధాన్యాలతో వారి ముఖ చిత్రాలను రూపొందించించి అందించారు. సిరి ధాన్యాల ప్రాముఖ్యం అందరికీ ఇలా చిత్రాల ద్వారా తెలిసేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఈ సిరి ధాన్యాల చిత్రాలలో అనేక మంది ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, రాజకీయ ప్రముఖులు

North America Telugu Society (NATS)
భాషే రమ్యం - సేవే గమ్యం

# స్వయంకృతం

పి. చంద్రశేఖర అజాద్

ఇద్దరూ నడుస్తున్నారు తోటలో...

మునిచంద్ర ముఖంలో ఏ మాత్రం కళ లేదు.

విరిగిపోయిన కొమ్మలు... బీభత్సంగా యుద్ధ రంగంలా వుంది. అప్పుడు రవి ఆగిపోయాడు. కాస్త దూరంలో చనిపోయిన కోతి కనిపిస్తోంది. అతని కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. మునిచంద్ర ఆ కోతిని గొయ్యి తీసి పాతి పెట్టాడు. అది మనిషికి చేస్తున్న అంత్యక్రియల్లా అనిపించాయి రవికి.

*** *** ***

రవి కుటుంబం వేసవి శెలవుల్లో మునిచంద్ర ఇంటికి వచ్చి మూడు వారాలు వుండటం ఎప్పటి నుండో జరుగుతోంది. వాళ్లు నగరంలో వుంటారు. ఇరుకు గదుల మధ్య వుండే పిల్లలకు ఒక్కసారిగా స్వేచ్ఛ దొరుకుతుంది. ఆ మూడు వారాలు వారి జీవితానికి సరిపడేంత జ్ఞాపకాలు. ఇటీవల నాలుగు సంవత్సరాలు ముని దగ్గరకు రావటం కుదరటం లేదు రవి కుటుంబానికి.

అయినా వేసవి కాలం రాగానే ముని దగ్గర నుండి బంగినపల్లి మామిడి పండ్లు వస్తూనే వున్నాయి. ఇంత వరకు రవి వాళ్లు ఆవకాయ పచ్చడి పెట్టుకునేదే లేదు. ముని పంపిస్తాడు. ఆ రుచి వేరు. అవనే కాదు - అరటి, జామ, బొప్పాయి పండ్లు, కూరగాయలు వస్తుంటాయి. ఎవరు హైదరాబాద్ వస్తున్నా, రాకపోయినా, బస్ డ్రైవర్ తో మాట్లాడి వాటిని ముని పంపిస్తాడు.

"ఈ సారి అకాల వర్షాలు పడి మామిడి పూతరాలిపోయిందా?" అని అడిగాడు రవి మామిడితోటలో నడుస్తున్నప్పుడు.

"కాదు. కోతులు మందలు మందలుగా వచ్చాయి".

"అదేంటి?"

"మనం ఇంతకు ముందు మన చిన్నప్పుడు లంక పొలాల్లోకి కోతులు రావటం చూశాం. తర్వాత అవన్నీ అడవులకు వెళ్లిపోయాయి. ఇప్పుడు మనం అడవులను మిగలనీయటం లేదు. అందుకని అవి పల్లెల్లోకి వస్తున్నాయి" అన్నాడు.

రవికి అప్పుడప్పుడు చదువుతున్న వార్తలు, చూస్తున్న దృశ్యాలు గుర్తు వచ్చాయి. చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు గుంపులుగా వచ్చి పంటలను నాశనం చేస్తుంటాయి. అంతకంటే ముందు పులి అడుగుజాడలు కనిపించాయని, కొండల మీద వాటిని చూశామని వార్తలు. సెల్ ఫోన్లలో వాటిని ఫోటోలు తీసి ప్రచురిస్తుంటారు.

అవి పశువుల్ని, గొర్రెల్ని మాత్రమే కాదు మనుషుల మీద దాడి చేసిన సందర్భాలున్నాయి. అలాంటి దృశ్యాల్ని చూసినప్పుడు కడుపులో తెములుతుంది. అక్కడ నుండి వాటిని వేటాడటానికి అటవీ అధికారులు రంగంలోకి దిగుతారు. బోనులు వస్తాయి. మనుషులకీ మృగాలకు మధ్య ఓ యుద్ధం జరుగుతుంది. కొన్ని ప్రాణాలు పోయాక ఆ మృగాలను బంధించి జూకి తరలిస్తారు. అది కామా మాత్రమే.

మరొక మృగం... మళ్లీ అలజడి... అదే కథ పునరావృతం.

"కోతులను తరిమేయటానికి మనుషుల్ని మాట్లాడుతున్నావా మునీ" అన్నాడు రవి.

ముని మాట్లాడలేదు. సాయంకాలం పిల్లలందరినీ తీసుకుని ఆ కొండ దగ్గరకు వెళ్లాడు.

రవి దిగ్భ్రాంతిగా చూస్తున్నాడు!

"ఇదేంటి మునీ" అన్నాడు అప్రయత్నంగా!

ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ ఆ కొండని చూస్తూ కాలం గడపటం రవికి ఇష్టం. ఆ కొండను ఆవరించుకుని మరి కొన్ని వున్నాయి. ముఖ్యంగా ఆ కొండని చూస్తుంటే ఓ మహాముని కళ్లు మూసుకుని తపస్సు చేస్తున్నట్లు వుంటుంది. ఆ మునికి ఈ ప్రపంచంలో జరుగుతున్నవేవీ పట్టనట్లు, మౌనంలోకి జారిపోయినట్లు కనిపిస్తాడు. మనుషులందరికీ ఇలాంటి ప్రశాంతత లభిస్తే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది.

"ఇదేంటి మావయ్యా... కొండను ఎవరు బద్దలుకొట్టారు?" సుచిత్ర అడుగుతుంటే ముని చిన్నగా తలూపాడు. జవాబు చెప్పలేదు.

ముని, రవి నడుస్తున్నారు.

"మనం క్రూర మృగాలు అంటుంటాం. అది క్రూరత్వమా! వాటికి ఆహారం కావాలి. సృష్టిలో ఓ జీవి మరో జీవికి ఆహారం. మన మనుషులకి....?" అని ఆగాడు.

"రైతు పండించే పంటలను కీటకాలు, అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు, జంతువులు నాశనం చేస్తాయనుకుంటాం. నిజానికి వీటి అన్నింటికి ఆద్యుడు మనిషి. మనలోని స్వార్థం" అన్నాడు ముని.

"నాలుగు సంవత్సరాలలోపు ఇంత విధ్వంసమా?"

"ఇక ముందు అంత సమయం అవసరం లేదు రవీ... రోజులు చాలు, గంటలు చాలు, సైన్స్ అంతగా కొత్త కొత్త యంత్రాలను సృష్టించింది. మనుషులు ఇప్పుడు కనిపించటం లేదు. అటు చూడు" అన్నాడు.

ఆ కొండ నోరు తెరుచుకున్న మహారాక్షసుడిలా కనిపించింది.

దానికింద వున్న సరస్సులో నీళ్లు అడుగంటిపోయాయి.

"రాక్షసుడు మునిని మింగేశాడా?"

"మునిని మాత్రమేనా... నదుల్ని, సముద్రాల్ని, ఆకాశాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతి సమస్తాన్ని. ఆ మహా రాక్షసుడు ఎవరో కాదు. మనిషి. కేవలం మనిషి" అంటున్నప్పుడు ముని గొంతు వణికింది.

*** *** ***

రాత్రులు అందరూ వెన్నెల్లో కూర్చున్నారు.

రకరకాల పాటలు పాడుతున్నారు. అతను తోటల మధ్య ఇల్లు కట్టుకున్నాడు. వ్యవసాయం తప్ప మరో ప్రపంచం లేదు. అక్కడ ఆవులు, గేదలు, కోళ్ల నుండి బాతులు, రకరకాల పక్షులు సందడి చేస్తుంటాయి.

మునిని నగరానికి రమ్మని రవి ఎప్పుడూ ఆహ్వానిస్తుంటాడు.

"ఇక్కడ చేయాల్సిన పనులు చాలా వున్నాయి రవీ... నువ్వే తీరిక చేసుకుని కుటుంబంతో రా" అంటాడు.

"మనకు ఈ ఉద్యోగాల్లో క్షణం తీరిక వుండదు. అయినా బోరు బోరు అంటుంటాం. అన్నయ్య గారు పొలాల్ని, పశువుల్ని, అక్కడ మనుషుల్ని వదిలి ఎలా వస్తారు? అయినా ఇక్కడ బిల్డింగ్స్ చూసి మురిసిపోవాలా? ఇక్కడ అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం చూస్తే తట్టుకోలేరు. మనమే వెళ్దాం" అంటుంది రాణి. వారికి ఇద్దరూ ఆడపిల్లలు. రెండోది మహిత.

మునికి ఇద్దరు మగపిల్లలు.

"ముని నగరాలకు రాకపోవచ్చు. నగరాల గురించి తెలియదని ఎలా అనుకుంటావు. తనకి టీ.వీ. వుంది. సెల్ ఫోన్ వుంది. ఈ దేశంలోనూ ప్రపంచంలోనూ జరిగే పరిణామాల గురించి మునికి అవగాహన వుంది".

"అదయితే నిజమే. నగరాల్లో వుండేవారికే ఈ జ్ఞానం వుండదు. ఆడవారయితే సీరియల్స్ చూడాలి. మగవాళ్లయితే బారులకు వెళ్లాలి. పబ్బులకి వెళ్లాలి. లేదంటే క్రికెట్ వుంది. శ్రీశ్రీ గారు అన్నారు కదా సంధ్యా సమస్యలని. రవ్వ ఇడ్లీ తినాలా సేమ్యా ఇడ్లీ నా అని ఒకరి సమస్య అయితే ఉరేసుకుని చావాలా రైలు కింద తల పెట్టాలా అనేది ఇంకొకరి సమస్య" అంది రాణి.

పిల్లలందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

ముని భార్య సుమ, రాణిలు ఇంకో పక్కన మాట్లాడుకుంటున్నారు.

"ఈ కరోనా మనుషుల్ని చాలా మార్చింది" అంది సుమ.

"అవునవును. అయినా ఇప్పటికీ మనం కళ్లు తెరుస్తున్నామా?" అంది రాణి.

"మీ అన్నయ్య ఏమంటారో తెలుసా? ఈ కరోనా ఆకాశం నుండి వూడిపడలేదు. ఈ ఎయిడ్స్-కేన్సర్- అలాంటి ఎన్నో ప్రమాదకర వ్యాధులు. ఇవన్నీ మనుషులు సృష్టించుకున్నారు. ఇవన్నీ రకరకాల కల్తీల నుండి వచ్చినవే కదా అంటారు".

"అవును వదినా.... ప్రకృతి మనకు అన్నిటిని స్వచ్ఛంగానే ఇచ్చింది. నీలాకాశం. తెల్లటి మబ్బులు, సెలయేర్లూ, పక్షులూ, పర్వతాలు, నదులు, సముద్రాలు, ఆకాశంలో వెలిగే నక్షత్రాలు, ఉదయించి అస్తమించే సూర్యుడూ, చంద్రుడూ, గ్రహాలు. అసలు విశ్వం ఎంత గొప్ప సృష్టి. దీనిని కలుషితం చేసుకున్నది మనమే కదా!"

"అందులో అనుమానం ఏముంది! మనుషుల్లో అనేక మంది రకరకాల పోరాటాలు చేస్తుంటారు. నిజానికి అందరూ కలిసి చేయవలసింది విశ్వాన్ని కాపాడుకోవటం కావాలి కదా!"

రాణి తలూపి ఆలోచనలో పడింది.

సమయం కరుగుతోంది.

"పిల్లలూ... ఇంక నిద్రపోదాం. రేపటి నుండి మనం చేయవలసిన పనులు చాలా వున్నాయి" అంది సుమ.

అందరూ లేచారు. ముని, రవి దగ్గరకు వచ్చారు.

"మేం ఇంకొంచెం సేపు మాట్లాడుకుంటాం. మీరు నిద్రపోండి" అన్నాడు ముని.

అందరూ వెళ్లారు.

"ఇప్పుడు రష్యా యుద్ధం ఎందుకు చేస్తున్నట్లు?" అన్నాడు ముని.

"ఉక్రెయిన్ ని ఆక్రమించుకోవటానికి" అన్నాడు రవి.

"ఉక్రెయిన్ ఎవరిది. అది ఒకప్పుడు రష్యాలో భాగమే కదా. అన్నదమ్ములు పొలం తగాదాల్లో ఒకరి నొకరు నరుక్కుంటే రెండు కుటుంబాలకు మాత్రమే నష్టం. మరి ఈ

యుద్ధం వలన ప్రపంచ దేశాలన్నీ అల్లాడిపోతున్నాయి కదా!"

"రాజకీయాలు మునీ....."

"ఎవరికి కావాలి రాజకీయాలు. పుతిన్ కి జ్ఞానం వుందా? ఇంకా కరోనా మనుషుల్ని విడిచిపెట్టిపోలేదు కదా! రష్యాలో కొన్ని వేల మంది కోవిడ్ తో చనిపోయారు కదా. ముందు నువ్వు దానితో యుద్ధం చేయాలి. అది వదిలి పెట్టావు. చివరికి అణుబాంబులు అయ్యాయి. జీవ, రసాయనిక ఆయుధాలను ఏ దేశానికి ఆ దేశం పోగు చేసుకుంటోంది. అంటే ఈ విశ్వాన్ని ఏం చేయాలనుకుంటున్నారు?"

రవి మాట్లాడలేకపోయాడు.

"ప్రకృతి మనుషులకు వంద సంవత్సరాలు ఆయువుని ఇచ్చింది అంటారు. బతుకు బతికించు అని పెద్దలు చెప్పారు. నువ్వూ, నీ కుటుంబం నాలుగు తరాలు బతకటానికి ప్రకృతి నీకు ప్రాణం పోసింది?"

"ఇది ప్రపంచాన్ని స్వంతం చేసుకోవాలనుకున్న వారందరూ ఆలోచించాలి కదా!"

"అవును. ఇప్పటికే ఆలస్యం అయింది రవీ" అన్నాడు ముని.

*** *** ***

రవి కళ్లు మూసుకున్నాడు. నిద్ర పట్టటం లేదు.

ఉక్రెయిన్ నుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్న జనం. అందులో భారతీయులు, అన్ని దేశాల వారు. మంచి నీళ్లు లేక దాహంతో రాలిపోయినవారు. భూమి మీద వుంటే బాంబుల దాడి అని బంకర్లలో తలదాచుకున్న వారు నగరాల్లో పేలుతున్న బాంబులు. ముక్కలవుతున్న శరీరాలు. భూమి నీటితో తడవటం లేదు. రక్తంతో తడుస్తోంది.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

భూమి అదృశ్యం అయింది. సముద్రాలు ఎండిపోయాయి. ఆకాశంలో మబ్బులు లేవు. నీటి చుక్క జాడలేదు. వృక్షాలు లేవు. జంతు జాలం లేదు. సూర్యచంద్రులు లేరు. నక్షత్ర మండలం లేదు. అసలు విశ్వమే లేదు. ఎవరు చేశారీ పని? ఏలియన్సా? వారికి ఆ అవసరం ఎందుకు వచ్చింది? ఇప్పుడు శూన్యం... శూన్యమే మిగిలింది.

ఉలిక్కిపడి లేచాడు రవి.

ఎక్కడో మెరుపు. భయంకరమైన ఉరుము. కరెంట్ పోయింది.

చీకటి-కటిక చీకటి.

అలనాటి ఆదిమ మానవులు ఈ చీకట్ల నుండి వెలుగులోకి పయనం మొదలుపెట్టారు. ఇప్పుడు చీకటి నుండి గాఢాంధకారంలోకి.

"మునీ" అని పిలిచాడు.

కొవ్వొత్తి వెలుగులో కనిపిస్తున్నాడు. అతను దీపధారి. ఒక్కసారిగా గాలి. కొవ్వొత్తి ఆరిపోయింది. అందరూ హాల్లోకి చేరుకుంటున్నారు.

రెండు గంటలపాటు బీభత్సం.

"ప్రళయం... ప్రళయం వచ్చేసింది" రవి గొణుగుతున్నాడు.

*** *** ***

ఓ పక్కన పిల్లలు మొక్కలు నాటుతున్నారు. రాణి-సుమ రాలిపోయిన పండ్లను చూస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఎదిగిన వృక్షాలు కూలిపోయాయి. వారి కళ్ల నుండి నీరు జారటం లేదు. అవి కూడా ఆవిరైపోయాయి.

"రవీ.... నిద్రిస్తున్న మనుషులకు ఏం జరిగిందో తెలుసుకునే లోపు ఇంత విధ్వంసం జరిగిపోయింది. తపస్సు చేస్తున్న ముని ఏమైపోయారు అన్నావు. కళ్లు తెరిచారు. అందులోనూ మూడో కన్ను. ప్రకృతి ఎప్పుడూ మనల్ని హెచ్చరిస్తూనే వుంది. నేనున్నాను జాగ్రత్త అంటోంది ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపవచ్చు. మత మారణహోమాన్ని నిలవరించవచ్చు. ప్రకృతి ప్రకోపిస్తే ఆ ప్రళయాన్ని ఆపటం మనుషులకు అసాధ్యం" అంటున్నాడు.

"అవును. ఇది స్వయంకృతం. భూమిని కాపాడుకోవటామా, భూమి పొరల్లో సమాధి కావటమా? ఇది మనుషుల చేతుల్లోనే వుంది" అనుకున్నాడు రవి.

- సమాప్తం –

# పశ్చాత్తాపం

కొమ్ముల వెంకట సూర్యనారాయణ

నటన....నటన....నటన.... నటనలో జీవించడం, జీవితంలో నటించడం. ఈ రెండింటిలో నటనలో జీవించిన వారికి ఉత్తమ పురస్కారాలు నంది అవార్డ్, ఆస్కార్ అవార్డ్ లాంటివి ఇస్తారు.కానీ నా దృష్టిలో నిజంగా నటనలో జీవించిన వారికి కాదు ఈ ఉత్తమ పురస్కారాలు ఇవ్వాల్సింది, జీవితంలో నటించేవారికి ఇవ్వాలి. ఎందుకంటే నటనలో జీవించడం అనేది మహా అయితే మూడునెలలో,నాలుగునెలలో జరిగే చలనచిత్ర చిత్రీకరణ లో నటించి తన పాత్రలో జీవిస్తారు,కానీ జీవితంలో నటించేవారు అలాకాదు కదా ఎల్లకాలం నటిస్తారు అదీ నాలాంటి మధ్యతరగతి వ్యక్తి అయితే జీవితాంతం నటిస్తూనే జీవితాన్ని వెళ్ళబుచ్చుతాడు, మరి ఇంత అధ్భుతంగా నటించి మెప్పించడానికి కారణం నా లాంటి మధ్యతరగతి వ్యక్తి సంఘర్షణకు లోనవకుండా, ఒత్తిడికి గురవకుండా, అసూయ ద్వేషాలతో రగిలిపోకుండా నాలో నేను కుమిలిపోకుండా చేస్తుంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ చెప్పినట్లు అవి నిజంగా రక్షకతంత్రాలే, ఆ రక్షకతంత్రాలనుపయోగించుకుని నటించకపోతే నా జీవితం ఇప్పటికే ఎప్పుడో తెల్లారిపోయుండేది. అందుకే ఆస్కార్ అవార్డ్ లాంటివి ఇవ్వాల్సి వస్తే నాలాంటి, జీవితంలో అధ్భుతంగా నటిస్తున్న మధ్యతరగతి మహానుభావులే నిస్సందేహంగా అర్హులు. ఒక్కొక్కటిగా నా జీవితంలో అద్భుతంగా నటించిన, ఇప్పటికీ నటిస్తున్న సందర్భాలన్నీ గుర్తుకొస్తున్నాయి.

***   ***   ***

మా నాన్నమ్మ ఎప్పుడూ అనేది " ఒరేయ్ ! బాబిగా, చిన్నప్పుడు స్కూలు కెళ్ళే టైమ్ కే సరిగ్గా కడుపు నొప్పో, తలనొప్పో వచ్చేసేది నీకు, ఓ! ఉంగచుట్టుకుపోయేవాడివి, తీరా చూస్తే మీ నాన్న అలా ఆఫీస్ కి బయలుదేరి వెళ్ళిపోయేసరికి ఏ నొప్పి ఉండేది కాదు,ఇంక మీ అమ్మ బడి టైమ్ దాటిపోయింది కదా అని బడికి పంపించేది కాదు". ఆ మాటలు అంటున్నప్పుడుల్లా అనిపించేది అంత అద్భుతంగా నటించేవాడినన్నమాట. కొంత పెద్దయిన తర్వాత హైస్కూల్ కి వచ్చేసరికి, నా స్నేహితుడు సూర్యం, స్కూలుకి నిగనిగలాడుతూ మెరిసిపోయే కొత్త నల్లటి బూట్లు వేసుకొచ్చాడొకసారి. నాకూ అటువంటి బూట్లు మా నాన్న చేత కొనిపించి వేసుకోవాలి అని అనుకునే వాణ్ణి కానీ ఆయన ఏదో చిన్న ప్రైవేటు కంపెనీలో పనిచేసేవారు, నా హైస్కూల్ ఫీజు కట్టడానికే ఇబ్బంది పడుతూ కట్టేవారు,ఇక బూట్లెక్కడ కొంటారు అందుకే ఆయన రేపు,మాపు అంటూ గడుపుకొచ్చేవారు,కొన్నిరోజులు చూసిన తరువాత అర్ధమైపోయింది,ఇది కొనే బేరం కాదని. ఈ లోపు సూర్యం కొత్త బూట్లు కరిచి కాలుకి పుండు పడటంతో మామూలు జోళ్ళు వేసుకొచ్చేవాడు,అది చూసి నాలో నటుడు మరల బయటకొచ్చాడు,అంతే నా జతగాళ్ళతో మా నాన్నకూడా నాకు బూట్లు కొంటానన్నారు,నేనే వద్దన్నాను కొత్త బూట్లు కరిచి కాలు పుండు పడితే ఇబ్బంది పడాల్సివస్తుందని చెప్పి,అలా నా కోరికను అణగదొక్కుకున్నాను.హైస్కూలు చదువు పూర్తయ్యేసరికి ఇటువంటి ఎన్నో విషయాల్లో రాజీపడి నటించాను.

అవి నేను కొత్తగా కాలేజిలో చేరిన రోజులు. మా ఇంటి దగ్గరనుంచి కాలేజి ఆరు కిలోమీటర్లు ఉంటుంది.ఎంత గొడవపెట్టి బస్ లో వెళతానన్న నాన్న ఓ డొక్కు సైకిల్ కొనిచ్చి దానిమీద వెళ్ళమన్నారు.తోటి స్నేహితులు గేలి చేసేవారు. మళ్ళీ ఫ్రాయిడ్ రక్షక తంత్రం నటుడుగా నాలో ప్రవేశించి " ఏడిసారు మీ కేం తెలుసు, ప్రతిరోజూ ఆరు,ఆరు పన్నెండు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళితే కలిగే ప్రయోజనం, నా ఫిజిక్ ఇంత బాగుండటానికి కారణం ఏమనుకుంటున్నారు, నిస్సందేహంగా సైకిల్ తొక్కటమే" అని సమర్ధించుకునే వాణ్ణి. ఇంటర్మీడియట్ లో నాన్న ఎం.పి.సి గ్రూప్ తీసుకోమని బలవంతం చేసినా డాక్టర్ చదవాలన్నకోరిక తో నా యిష్టప్రకారమే బై.పి.సి. తీసుకున్నాను. ఇంటర్మీడియట్ లో కొన్ని సబ్జెక్టులు కష్టమనిపించి నాన్నను ట్యూషన్ పెట్టించమన్నా "నేను ట్యూషన్ పెట్టించలేను,కష్టపడి చదువుకోవడమే " అని చెప్పేసరికి కష్టపడి చదివి యింటర్మీడియట్ అయితే ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యాను కానీ ఆ పడిన కష్టం ఎంసెట్ లో మంచి ర్యాంకు వచ్చేస్థాయిలో లేకపోవడంతో ఎం.బి.బి.యస్ సీటు సంపాదించలేకపోయాను, ఆ బాధను కప్పిపుచ్చుకోవడానికి నాన్నతో "కష్టమైన సబ్జెక్టులకు ట్యూషన్ పెట్టించమన్నాను, పెట్టించలేదు కాబట్టే ఎంసెట్ లో మంచి ర్యాంకు సంపాదించలేకపోయాను అని చెప్పి నా

అహాన్ని సంతృప్తి పరచుకున్నాను". "ఏరా,మరొకసారి ప్రయత్నించకపోయావా అని అడిగేవారికి, నా స్థాయేంటో నాకు తెలిసిందే కదా,మరొకసారి ప్రయత్నించినా రాదని తెలిసి దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎం.బి.బి.యస్ లో శవాలను కోయాల్సిఉంటుందట,అంతే కాదు చూస్తున్నారు కదా ప్రస్తుత డాక్టర్ల పరిస్థితి, రేయనక, పగలనక పేషెంట్స్ ని చూడాల్సిఉంటుంది, పైగా డాక్టర్లేమైనా దేవుళ్ళా?ప్రతీ పేషంట్ రోగాన్ని తగ్గించేయడానికి వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేస్తారు అయినా కొన్ని కేసులు ఫెయిల్ అవుతాయి,అటువంటి సంధర్భంలో భౌతికంగా దాడులు చేస్తున్నారు,అవి ఎంతవరకు సమంజసం?, ఇవన్నీ చూసే నాకు ఎం.బి.బి.యస్ మీద ఆసక్తి పోయింది"అని నా అహాన్ని సంతృప్తి పరచుకోవడానికి సమాధానమిచ్చే వాణ్ణి.అలా మొత్తం మీద ఎంసెట్ కి వీడ్కోలు చెప్పి, బి.యస్సీ అయిందనిపించి చిన్న ఉద్యోగంలో స్థిర పడ్డాను. అమ్మానాన్నలు చూసివచ్చిన రెండు మూడు సంబంధాలను జాతకాలు కలవలేదనో, అమ్మాయి నచ్చలేదనో తిరగ్గొట్టాను కానీ అసలు కారణం అది కాదు వాళ్ళు ఇస్తానన్న కట్నం నచ్చక ఎందుకంటే అప్పటికే మధ్యతరగతి జీవితాలు ఎలాఉంటాయో స్వానుభవమే కదా దాని నుంచి బయటపడటానికి. నా ఉద్యోగమా చిరుద్యోగం కనుక ఇంక ఆశ, కట్నం రూపేణా ఎక్కువ రాబట్టుకుంటే ఈ మధ్యతరగతి జీవితాన్నుంచి బయటపడొచ్చని,అలాగని ముఖాముఖి చెప్పలేను కదా,అందుకే ఈ డొంకతిరుగుడు నటన. ఈ సారి చూసిన అమ్మాయి నచ్చేసింది కారణం వాళ్ళు ఇచ్చే కట్నం నచ్చి, ఆ అమ్మాయికి పోలియో వల్ల ఒక కాలు చచ్చుపడిపోయినా. కానీ పైకి మాత్రం పెళ్ళికి ఒప్పుకోవటానికి కారణం అటువంటి అమ్మాయికి వైవాహిక జీవితాన్ని ప్రసాదించి ఒక ఆదర్శానికి నాంది పలికాను అని సమాజానికి ఒక సందేశం అందేలా ప్రవర్తించాను.పైపెచ్చు వివాహమయిన తరువాత నా భార్యను బి.యస్సి.,బి.యిడి., చదివించి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించేలా ప్రోత్సహించాను. స్త్రీ వంటింటికే పరిమితం అయిపోకుండా, అదేవిధంగా ఎల్లకాలం ప్రతి చిన్న విషయానికి భర్తమీదే ఆధారపడకుండా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనే నా భార్యను చదివించి ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా ప్రోత్సహించానని సమాజంలో అత్యద్భుతంగా నటించాను కానీ అసలు ఉద్దేశం ఆర్థికంగా మరింత పుంజుకోవాలనే. ఆర్థికంగా కొంత పుంజుకున్నప్పటికి నా మధ్యతరగతి మనస్తత్వాన్ని విడిచిపెట్టలేదు." ఏవండీ! ఇంకెంతకాలం ఇలా కట్టెలపొయ్యితో, గ్యాస్ పొయ్యి కొనుక్కుందామన్నది ఒక రోజు నా శ్రీమతి, అంతే మరల నాలో ఒక అద్భుత నటుడు పరకాయ ప్రవేశం చేసాడు. "చూడు, ప్రముఖ రచయిత్రి మాదిరెడ్డి సులోచనకి ఏమయింది, గ్యాస్ సిలిండెర్ పేలి దారుణంగా చనిపోయారు, అంతేకాదు నీ విషయానికొస్తే అటువంటిదే సంభవిస్తే నువ్వు ఇంటిలోంచి బయటపడటమే కష్టం" అంటూ సానుభూతి ఒలకబోసాను.అలాగే ఒక వాషింగ్ మెషిన్ కొనమన్నా,ఒక గ్రైండర్ కొనమన్నా, ఇపుడు ఆడవాళ్ళు అందరు వీటికి అలవాటు పడి శారీరక శ్రమ మరిచిపోవడమే అనేక రోగాలు చుట్టుముట్టాడానికి కారణం అని చెప్పి నమ్మించేవాణ్ణి. అందుకే మరల గ్యాస్ స్టవ్ మాటకానీ,వాషింగ్ మెషిన్ మాట కానీ, గ్రైండర్ మాటకానీ నా భార్య చాలాకాలం ఎత్తలేదు. ఈ లోపు అబ్బాయి పుట్టాడు, "నీ పరిస్థితి దృష్ట్యా రెండవ సంతానం వద్దు"అని నా శ్రీమతి దగ్గర, అక్కడికేదో తన క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా నటించి ట్యూబెక్టమి చేయించాను. అసలు అంతరంగమేమిటంటే రెండవ సంతానం అమ్మాయి అయితే అది నాకు ఒక భారం, అబ్బాయి అయినా ఆర్థికంగా కొంత వెనుకపడిపోతాననే భావన. నేను సాధించలేకపోయినది, నా కొడుకు ద్వారా సాధించుకోవాలనే అంతరంగ తపనతో చిన్నప్పటినుంచి హాస్టల్ లో ఉంచి చదివించి,ఈ సారి వైద్యవృత్తికి ఉండే విలువను నా కొడుకు దగ్గర పెద్ద ఎత్తున ప్రొజెక్ట్ చేసి ఇంటర్ బై.పి.సి గ్రూప్ తీయించి ఎం.డి., చేయించాను,తన సహధ్యాయి అయిన వేరే కులపు అమ్మాయిని ప్రేమించానని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నానని నా కొడుకు చెప్పేసరికి కులాంతర వివాహం నాకిష్టం లేకపోయినా, నా నిర్ణయాన్ని అంగీకరించే పరిస్థితి కనిపించక, అభ్యుదయవాది రూపాన్ని ఆపాదించుకుని అట్టహాసంగా నా కొడుకు పెళ్ళి జరిపించాను.నా కొడుక్కి పెళ్ళైన కొత్తలో ఒకటి రెండు సార్లు కొడుకు,కోడలు దగ్గరకు వెళ్ళినపుడు కోడలు ప్రవర్తించిన తీరు తెలిసొచ్చింది. తరువాత వాళ్ళకి అబ్బాయి పుట్టినపుడు వాడిని చూసుకోవడానికి ఇంటి దగ్గర శాశ్వతంగా ఉండేలా మమ్ములను రమ్మంటే అంతరార్థమేమిటో గ్రహించి "సొంతయిల్లు,పొలం, పాడయిపోతాయి" అని రాలేమని చెప్పి అసలు విషయాన్ని కప్పిపుచ్చి మరొకసారి నటించాల్సి వచ్చింది. బంధువులు దగ్గర కూడా " మా అబ్బాయి, వాళ్ళ దగ్గర ఉండమని గొడవ

పెట్టేస్తున్నాడు, అయినా సొంత ఇల్లు, బంధువులను విడిచిపెట్టుకుని ఏమి వెళతామని అందంగా అబద్ధాన్ని అతికేలా పలికే వాణ్ణి.

***    ***    ***

కాలం ఎల్లకాలం ఒకేలా ఉండదు కదా,చరమాంకం లోకి ప్రవేశించేసరికి నా ఒంట్లోకి కాన్సర్ ప్రవేశించింది.ఇపుడు నిజంగానే తన దగ్గర ఉంచుకోవడానికి ఇష్టపడలేదు నా కొడుకు. ఒక ప్రక్క ఉద్యోగం చేస్తూ, మరొక ప్రక్క ఆ చచ్చు పడిన కాలుతోనే నన్ను హాస్పిటల్స్ కి తిప్పుతూ కంటికి రెప్పలా కాపాడుకుంది నా భార్య. నేను ప్రతిసారి నా స్వార్ధం కోసమే తగిన రక్షకతంత్రాలను ఉపయోగించుకుంటూ నటించాను. కానీ ఆమెకు ఓ మనసుంటుంది అని ఏనాడు గ్రహించలేదు.  నా భార్య ఎప్పుడు తను ఏమి అడిగినా ఏదో ఒకటి చెప్పి నమ్మించాననుకున్నాను,కానీ ఇపుడు తెలిసింది నేను చెప్పిన ప్రతి విషయాన్ని నమ్మినట్టు అద్భుతంగా నటించి తనకు తాను నాకు అందనంత ఎత్తుకు ఎదిగింది.నేను రక్షకతంత్రంగా భావించి తన పట్ల ప్రవర్తించిన అన్ని విషయాలలో వాటిని సానుకూల దృక్పధంతో మలచుకుని ముందుకు సాగింది. నేనేమో మధ్యతరగతి వాణ్ణి,మధ్యతరగతి వాణ్ణి అనుకుంటూ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని జారవిడిచి అవకాశవాద నటనను ప్రదర్శించాను. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎదిగిన ఆమె ముందు ఇపుడు నేనో మరుగుజ్జు ననిపించింది.అందుకే ఏ మాత్రం భేషజాన్ని ప్రదర్శించకుండా, మొట్టమొదటి సారి నటించకుండా నా భార్య ముందు మోకరిల్లాను.నిండు మనసుతో నన్ను దగ్గరకు తీసుకుంది.

-సమాప్తం-

## నాన్నా నువ్వే నా హీరోవి

కొమ్ముల వెంకట సూర్యనారాయణ


నాన్న నువ్వు చిన్నప్పుడు కొడితే కోపం వచ్చేది,
కానీ ఆ దెబ్బలే లేకుంటే మాకు మంచి బుద్ధులు వచ్చేవి కావు,
అడిగింది కొనివ్వనపుడు ఏడుపొచ్చేది,
అలా చేయడం వల్లే మాకిప్పుడు డబ్బు విలువ తెలిసొచ్చింది,
స్కూల్లో వేసినప్పుడు నీ కన్నా అమ్మే నయం అనిపించేది,
కానీ నువ్వు అలా చేయడం వల్లే
మా జీవితాలు బాగుపడ్డాయి,
చెడు మార్గాల్లో వెళ్ళినప్పుడు మందలిస్తే నువ్వు శత్రువులా కనిపించావు,
కానీ అలా చేయడం వల్లే మాలో మానవత్వం మిగిల్చావు,
అడిగినప్పుడు డబ్బులివ్వకుంటే మా మీద ప్రేమ లేదనుకునే వాడిని,
కానీ అలా చేయడం వల్లే ఈ రోజు డబ్బు కన్నా మీరంటేనే ప్రేమ     ఏర్పడింది,
ఇంట్లో అన్నీ పనులు చెబితే విసుక్కునేవాన్ని,
కానీ అలా చేయడం వల్లే బరువు బాధ్యతలు తెలిసొచ్చాయి,
ఇంట్లో అందరు నీ మాటే వినాలంటే గర్వం అనుకున్న,
కానీ నీ మాటతో అందరిని ఒక్క తాటి పైకి తెచ్చావని ఇప్పుడు అర్థం చేసుకున్న,
ఇంట్లో అందరి బాగోగులు అమ్మే చూసుకుంటుంది,
కానీ ఆ అమ్మ బాగోగులు చూసుకుంటూ నువ్వు వెనకే వున్నావు నాన్న,
నాన్న నాకు జీవితంలో నిజమైన హీరోవి నువ్వే.

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
14 Clemmens Ct, Edison, NJ 08820: **http://www.tfasnj.org**

## Condolences - Sri Paramjyoti Kocherlakota garu



It is with much sadness to inform you all that Kocherlakota Paramjyoti Garu passed away on Sunday morning (April 2nd) at 8.50am at Yashoda Hospital here in Hyderabad. He lived a magnificently full life of 90 years, with his birthday celebrated 2 months ago. Paramjyoti Garu was born in Madras in 1934 and spent nearly 40 years in the United States where he emigrated 52 years ago, with just $8 in his pocket. He was a Chemical Engineer by profession but was known to music lovers as one of India's finest Tabla maestros. He was the student of Ustad Amir Hussain Khan, one of Indian history's finest Tabla players and was one of the few Southern born men, standing well over 6 feet with broad shoulders, who was a darling of North Indian music. He performed thousands of concerts with almost all of India's finest masters including Bharat Ratna Pandit Ravi Shankar, Pt. Hariprasad Chourasia, Shivakumar Sharma, and countless others over a 70-year illustrious career.

He and his wife Smt. Nirmala Garu are ardent fans of Indian classical arts including dance and music. Both of them were early members of and huge supporters of TFAS and other Telugu associations. His wife Smt. Nirmala, at the age of 82, was with him for every moment. They were the happiest couple, most loving and supportive of one another, sharing one soul and one mind, and a model of marital devotion to so many. He is survived by his wife Smt Nirmala Garu, Dr Prashanth Garu – psychologist at Yashoda hospital and an excellent Tabla player in his right, daughter-in-law Dr Shrilekha and the light of his life grand-daughter Maya. His family thanks all of you who reached out to them. TFAS Executive Committee expressing their deepest condolences fore the loss to his family.

If you wish to contact their family, you message Dr Prashanth on WhatsApp at +91- 9676502654. Smt. Nirmala Garu can be reached by WhatsApp message at +91-9989077385.






Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

DIVERSITY JOURNAL 2016 DIVERSITY LEADER AWARD
BEST PLACES TO WORK 2017 for LGBT Equality 100% CORPORATE EQUALITY INDEX
training TOP 125

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

NEW YORK LIFE